# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :39 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 30-03-2024 | పేజీలు:4 వెల: 2.00


## దేశీయ అస్త్రం తేజస్ రెడీ...

భారతీయ వాయుసేనలో మరో దేశీయ అస్త్రం సమకూరింది. తేలిక పాటి పోరాట పటిమ గల తేజస్ శ్రేణికి చెందిన తేజాస్ మార్క్ 1 ఎ ఫైటర్ జెట్ బెంగళూరులో విజయవంతంగా రూపొందించబడింది. ఈ శ్రేణికి చెందిన ఫైటర్ తొలి యుద్ధ విమానం బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)లో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. ఈ పరిశీలన హెచ్ఏఎల్ అధికారులు గుర్తించారని వార్తా సంస్థలు గురువారం తెలిపాయి. ఈ విమాన ప్రయాణ సామర్థతను తొలిసారిగా నమూనాగా 15 నిమిషాల పాటు పరీక్షించారు. త్వరలోనే ఈ ఫైటర్‌ను రాజస్థాన్‌లోని బికనేర్ నాల్ వైమానిక స్థావరానికి తరలిస్తారు. పాకిస్థాన్ సరిహద్దుల నుంచి ముప్పును తట్టుకునే రీతిలో అత్యంత వ్యూహాత్మకంగా ఇక్కడ ఎయిర్‌బేస్‌లో ప్రవేశపెడుతారు.ఇది రెండు సీటర్ల శిక్షక విమానం ఐఎఫ్‌కు సేవలకు అనుగుణంగా సిద్ధం అవుతుంది. ఇక పూర్తి స్థాయిలో ఈ ఫైటర్‌ను ఈ నెల 31న బేస్‌కు తరలించడం జరుగుతుందని. ఇక వాయుసేన ఇప్పటికే హెచ్ఏఎల్‌తో ఇటువంటి 83 ఫైటర్స్ కొనుగోళ్ల దిశలో కాంట్రాక్టు

## దాదాపుగా కారు ఖాళీ! భారీ కుదుపు, మరొకరు..?



హైదరాబాద్,లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది.. తగులుతోంది కూడా. కారు నుంచి ఎవరు ఎప్పుడు జంప్ అవుతారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆ పార్టీ నుంచి గట్టిగా మాట్లాడిన నేతలు ఒకొక్కరు జారుకుంటున్నారు. దీంతో ఆ పార్టీ ఏం జరుగుతుందోనన్న చర్చ ఇప్పుడు సాగుతోంది. మిగతా నేతలు కూడా సర్దుకునే పనిలో పడినట్టు పొలిటికల్ సర్కిల్‌లో టాక్ నడుస్తోంది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికలు వచ్చేనాటికి ఆ పార్టీ దాదాపు ఖాళీ కావడం ఖాయమని నేతలు చెప్పుకుంటున్నారు.బీఆర్ఎస్‌కు కాలం కలిసి రాలేదా? పేరు మార్చిన ఆ పార్టీకి కష్టాలు రెట్టింపయ్యాయా? దశాబ్దంపాటు చక్రం తిప్పిన గులాబీ బాస్ పరిస్థితి ఇప్పుడు ఏంటి? ఒకవైపు మద్యం కుంభకోణం, మరోవైపు ఫోన్ ట్యాపింగ్, ఇంకోవైపు ప్రాజెక్టుల వ్యవహారం వంటి సమస్యలు చుట్టుముట్టేశాయి. ఈ క్రమంలో నేతలు తమకున్న పరిచయాలతో వలస పోతున్నారు. నేతలు జారుకోవడంతో కారు ఖాళీ అవుతోంది. ఆ పార్టీ నుంచి చాలామంది నేతలు అధికార కాంగ్రెస్‌లోకి చేరిపోయారు. మరికొందరు బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఈ జాబితా ఇంకా కంటిన్యూ అవుతోంది.తాజాగా మాజీమంత్రి కడియం శ్రీహరి కూడా పార్టీ మారుబోతున్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందులోభాగంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. అధ్యక్షుడు ఖర్గే ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ తరపున వరంగల్ అభ్యర్థిగా కావ్య బరిలో నిలిచే ఛాన్స్ ఉందని అంటున్నారు. కాలం కలిసొస్తే కడియం శ్రీహరికి రేవంత్ మంత్రివర్గంలో ఛాన్స్ కల్పిస్తారనే ప్రచారం లేకపోలేదు. ఇందుకు కారణాలు చాలానే ఉన్నాయని అంటున్నారు.రాజకీయాల్లో సుధీర్ఘం అనుభవమున్న నేతల్లో కడియం శ్రీహరి కూడా ఒకరు. ఎన్టీఆర్ పిలుపుతో ఎంట్రీ ఇచ్చిన ఆయన వెనుదిరిగి చూడలేదు. దాదాపు నాలుగు కిందట రాజకీయాల్లోకి వచ్చిన కడియం, కలిసి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నారు. 30 ఏళ్ల కిందట స్టేషన్ ఘన్‌పూర్ నుంచి విజయం సాధించిన ఆయన.. తొలిసారి ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా చేశారు. ఆ తర్వాత చంద్రబాబు మంత్రివర్గం లోనూ కీలక బాధ్యతలు చేపట్టారు.తెలంగాణ ఉద్యమం సమయంలో టీడీపీకి గుడ్ బై చెప్పేసి.. అప్పటి ఉద్యమ పార్టీలోకి చేరిపోయారు కడియం శ్రీహరి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి ఎంపీగా కూడా గెలిచారు. ఆ తర్వాత మారిన రాజకీయ సమీకరణాలతో ఎంపీ పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారాయన. ఆ పార్టీలోని సీనియర్లు ఒకొక్కరుగా వెళ్లిపోవడంతో పలుమార్లు కార్యకర్తలతో చర్చించారు. చివరకు కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

## పెద్దపల్లిలో ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ గని కార్మికుడికి మధ్య పోటీ



మందమర్రి: బీఆర్ఎస్‌ను కుటుంబ పాలన అని విమర్శించిన ఎమ్మెల్యే వివేక్.. తన కుటుంబంలో ఇద్దరికి ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ టికెట్ ఇవ్వడం కుటుంబ పాలన కాదా అని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. ఆస్తులను కాపాడుకునేందుకే ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా వివేక్ కుటుంబం పార్టీలు మారుతూ అధికారం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి ఎంపీ నియోజకవర్గంలోని మందమర్రిలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి బాల్కసుమన్ ప్రచారం నిర్వహించారు. గత 50 ఏండ్లుగా వివేక్ కుటుంబాన్ని ప్రజలు ఆదరిస్తే ఈ ప్రాంతంలో ఒక్క ఫ్యాక్టరీ కూడా పెట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ఆగర్భ శ్రీమంతుడికి, భూగర్భ గని కార్మికుడికి మధ్య జరుగుతున్న పోటీ. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందరని విమర్శించారు.రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తనకు సింగరేణి బొగ్గు కార్మికుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ఎన్నికలు రాగానే వలస పక్షులు వస్తుంటారని, తాము గెలవడానికి గ్రూప్ రాజకీయాలను ప్రోత్సహిస్తారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థిది వారసత్వ రాజకీయమని, గత 50 ఏండ్లుగా పదవులు అనువిస్తూ వివేక్ కుటుంబం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వాళ్ల ఆస్తుల రక్షణకు ఎన్ని పార్టీలైనా మారుతారని, ఎన్నికల్లో గెలిస్తే ప్రజల మధ్య ఉండకుడా.. వ్యాపారాలు, పరిశ్రమలు చూసుకుంటూ హైదరాబాద్‌లో ఉంటారని విమర్శించారు.

## ముక్తార్ అన్సారీపై విష ప్రయోగం జరిగింది: ఉమర్ అన్సారీ



లక్నో: యూపీ గ్యాంగ్‌స్టర్, మాజీ ఎమ్మెల్యే ముక్తార్ అన్సారీ మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తన తండ్రి ముక్తార్ అన్సారీకి జైలులో విష ప్రయోగం జరిగిందని కుమారుడు ఉమర్ అన్సారీ ఆరోపించారు. ఉమర్ చేసిన ఆరోపణలను జైలు అధికారులు ఖండించారు. తనకు స్లో పాయిజనింగ్ జరుగుతున్నట్లు తన తండ్రి చెప్పాడని ఉమర్ అన్సారీ మీడియాతో పేర్కొన్నాడు.యావత్ దేశానికి ఈ విషయం తెలుసు అని అతను తెలిపాడు. ముక్తార్ అన్సారీ సోదరుడు, ఘాజిపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ కూడా ముక్తార్‌పై విష ప్రయోగం జరిగినట్లు ఆరోపించాడు. శుక్రవారం ముక్తార్ ఇంటి వద్ద భారీ సంఖ్యలో జనం చేరుకున్నారు. భద్రతా దళాలను కూడా భారీగా మోహరించారు.ఉత్తర ప్రదేశ్‌లోని బాందా వైద్య కళాశాలలో చికిత్స పొందుతూ ముక్తార్ తుది శ్వాస విడిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కౌశల్ తెలిపారు. బాందా జైలులో ఖైదీగా ఉన్న ఆయన ఆరోగ్యం క్షీణించడంతో జైలు అధికారులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సీఆర్‌పీసీ సెక్షన్ 144 ప్రకారం నిషేధాజ్ఞలను అమల్లోకి తీసుకొచ్చారు. ఎక్కువ మంది ఒకే చోట గుమికూడకూడదని పోలీసులు ఆదేశించారు.ముక్తార్ అన్సారీపై 60 క్రిమినల్ కేసులు విచారణలో ఉన్నాయి. ఆయనకు శిక్షలు పడటం 2022 సెప్టెంబరు నుంచి ప్రారంభమైంది. ఎనిమిది కేసుల్లో వేర్వేరు కోర్టులు శిక్ష విధించాయి.

## బిఆర్ఎస్‌కు గోడదెబ్బ..చెంపదెబ్బ

హైదరాబాద్,మార్చి29: అధికార పార్టీ విసురుతున్న వలలో బిఆర్ఎస్ చేపలు పడుతూనే ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం ఇవే రాజకీయాలు నడుస్తున్నాయి. గతంలో కెసిఆర్ విసిరిన వలనే ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి విసురుతున్నారు. తాజాగా తెలంగాణ రాజకీయాలు అనూహ్య పరిణామాల దిశగా నడుస్తున్నాయి. ఎవరూ ఊహించని విధంగా కేశవరావు, అయన కుమార్తె మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు ఆయన కుమార్తె డాక్టర్ కావ్య కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. ఈ క్రమంలో ఇంతపెద్ద ధక్కా బిఆర్ఎస్‌కు తగులుతుందని ఎవరూ ఊహించి ఉండరు.కాంగ్రెస్ ఆహ్వానం మేరకు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరనున్నారు. తన కూతురు కావ్య సహా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. వరంగల్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇద్దరిలో ఒకరికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్‌లో కడియం చేరికతో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. కడియం శ్రీహరి బీఆర్ఎస్ ను వీడటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ పార్టీకి గట్టి దెబ్బే తగిలే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు నేతలు పార్టీని వీడారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ అధిష్టానం.. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థి కోసం అన్వేషణ చేస్తోంది. ఈ క్రమంలో మాజీమంత్రి ,నటుడు బాబూ మోహన్‌కు కెసిఆర్ ఫోన్ చేసి ఆహ్వానించినట్లు సమాచారం. బిఆర్ఎస్‌లో చేరితే వరంగల్ టిక్కెట్ ఇస్తానని అన్నట్లుగా సమాచరం. ఆయన నేడోరేపో పార్టీలో చేరి వరంగల్ టిక్కెట్ సాధించవచ్చు. ఆయన గోల్ కూడా వరంగల్ నుంచి పోటీ చేయడం కనుక ఇద్దరి లక్ష్యం నెరవేరుతుంది. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్(ఃఖా)కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే కీలక నేతలందరూ వరుసగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరుతున్న విషయం తెలిసిందే. ఇదేకోవలో వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించడం పెద్ద దెబ్బే. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ నుంచి తప్పుకుంటు న్నట్లు కడియం కావ్య స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్‌కు ఈ విషయంపై కావ్య లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, పార్టీకి జనాదరణ కరువైన నేపథ్యంలో ఎంపీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు కావ్య ప్రకటించారు. ఈ క్రమంలోనే స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు. పార్లమెంట్ బరిలో వరంగల్ కాంగ్రెస్ నుంచి కడియం శ్రీహరి లేదా కావ్యకు టికెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. తాజా ఘటనలపై ఎక్స్‌లో స్పందించిన బీఆర్ఎస్



వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జరగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శూన్యం నుంచే సునామీ సృష్టించిన కేసీఆర్ ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు బెదిరిపోతారా అంటు ప్రశ్నించారు. అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ధీశాలి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని కొనియాడారు. ఒక్కడుగా బయలుదేరి లక్షల మంది సైన్యాన్ని తయారు చేసి, ఎన్నో అవమానాలు, ద్రోహాలు, కుట్రలు, కుతంత్రాలు అన్నిటిని ఛేదించిన ధీరత్వం కేసీఆర్‌దన్నారు. ఆలాంటి ధీరుడిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే రాజకీయ బేహారులకు తెలంగాణ ప్రజలే జవాబు చెబుతారన్నారు. ప్రజా ఆశీర్వాదం, మద్దతుతో 14 ఏళ్లు పోరాడి, ఉద్యమ పార్టీగా తెలంగాణను సాధించి.. తెచ్చుకున్న తెలంగాణ దశను, దిశను మార్చి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్‌ని, బీఆర్ఎస్ పార్టీని ప్రజలే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారన్నారు. నికార్సైన కొత్తతరం నాయకత్వాన్ని తయారు చేస్తామని.. పోరాట పంథాలో కదం తొక్కుతామని కేటీఆర్ తెలిపారు. తండ్రిని ఆకాశానికి ఎత్తేశారు. అక్కడితో ఆగిపోని కేటీఆర్ నేతలపై కూడా సెటైర్లు వేశారు. ద్రోహులకు ప్రజలే బుద్దిచెబుతారంటూ ఫైర్ అయ్యారు. కచ్చితంగా కేసీఆర్‌ను ప్రజలే కాపాడుకుంటారని అన్నారు. ఆలాంటి ధీరుడిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే రాజకీయ బేహారులకు తెలంగాణ ప్రజలే జవాబు చెప్తారు. నాయకత్వం తయారు చేయడం కేసీఆర్‌కు కొత్త కాదని... లక్షల మందిని ఉద్యమంవైపు పరుగులు పెట్టించిన కేసీఆర్ వెనక్కి తగ్గబోరని అన్నారు కేటీఆర్. కచ్చితంగా కొత్త నాయకత్వం తయారు చేసుకొని ప్రజల తరఫున పోరాటం చేస్తామంటున్నారు. 'నికార్సైన కొత్తతరం నాయకత్వం తయారుచేస్తాం, పోరాట పంథాలో కదం తొక్కుదాం' అని పోస్టు చేశారు.

## కాంగ్రెస్ పార్టీనే మాకు వెన్నుపోటు పొడిచింది..

హైదరాబాద్ : తాము బీఆర్ఎస్ పార్టీ వీడుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని, చివరి శ్వాస వరకు కేసీఆర్‌తోనే తమ ప్రయాణం కొనసాగుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కుమారుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి తేల్చిచెప్పారు. తెలంగా ఓణ భవన్‌లో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కార్తీక్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.రంగారెడ్డి జిల్లా ప్రజల రుణం తీర్చుకోలేనిది. నాన్న పటోళ్ల ఇంద్రారెడ్డికి ఐదు సార్లు, అమ్మ సబితమ్మకు ఐదు సార్లు అవకాశం ఇచ్చారు. 1983 నుంచి ఇప్పటి వరకు పదిసార్లు జిల్లా ప్రజల ఆశీస్సులు పొందాం. మా ప్రస్థానం వేరు.. ఇప్పుడు పార్టీలు మారుతున్న వారి ప్రస్థానం వేరు. వారికి మాకు చాలా తేడా ఉందని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు.ఇంద్రారెడ్డికి ఎన్టీ రామారావు భిక్ష పెట్టారు. 1994లో ఆగస్టు కుంభకోణం తర్వాత ఎన్టీ రామారావుతో ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఇంద్రారెడ్డి ఒకరు. ఎన్టీ రామారావు చనిపోయిన తర్వాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆహ్వానంతో కాంగ్రెస్ పార్టీలో చేరాం. రాజశేఖర్ రెడ్డి ఉన్నంత వరకు ఇబ్రహీంపట్నం నుంచి తాండూరు వరకు కాంగ్రెస్ పార్టీకి ఏ కష్టం, నష్టం వచ్చినా మా అమ్మ కాలు అరిగేలా తిరిగింది. పార్టీ కోసం కష్టపడింది. నమ్మకంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అమ్మ మీద ఐదు సీబీఐ కేసులు పెట్టింది. వేరే వారికి రెండు మూడు టికెట్లు ఇచ్చి, మాకు ఒక



టికెట్ ఇచ్చి అవమాన పరిచేలా ప్రవర్తించారు. చివరకు కాంగ్రెస్ పార్టీ మమ్మల్ని ఖతం చేయాలని ప్లాన్ చేసింది. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని చెప్పి కేసీఆర్, కేటీఆర్ టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించి,అవకాశాలు ఇచ్చారు.కాంగ్రెస్‌కు మేం వెన్నుపోటు పొడవలేదు. పార్టీనే మాకు వెన్నుపోటు పొడించింది. ఇప్పుడు పార్టీలు మారేవారితో మమ్మల్ని పోల్చకండి. ఏ విధంగానైతే ఎన్టీఆర్, వైఎస్సార్‌తో ఎలా ఉన్నామో కేసీఆర్ వద్ద కూడా చివరి శ్వాస ఉంటాం అని కార్తీక్ రెడ్డి తేల్చిచెప్పారు.

## రైతుల తరపున పేగులు తేగేదాక కొట్లాడుతాం : ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



సూర్యాపేట : ఎస్సారెస్పీ కింద నీళ్లు ఇస్తాం పంటలు వేసుకోండని చెప్పి మరి ప్రభుత్వం రైతులను నిలు వునా మోసం చేసింది. నేడు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఎండిపోయిన పంట పొలాలే దర్శనమిస్తున్నాయని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తుంగతుర్తి మండలం వెలుగుపల్లి, మొండి కుంట తండా గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు.ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం, ప్రాజెక్టులు, నీళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస అవగాహన లేదన్నారు. ఎస్సారెస్పీ కింద కాళేశ్వరం నీళ్లతో గత నాలుగేళ్లుగా వరుసగా రెండు పంటలకు నీళ్లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీది. రైతులు కోట్ల రూపాయల అప్పుల్లో కురుకుపోయారు. ఆయినా ప్రభుత్వానికి సోయిలేదని మండిపడ్డారు.ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆరోపించారు. రైతుల తరపున పేగులు తేగేదాక దాక కొట్లాడుతామని స్పష్టం చేశారు .ప్రభుత్వం మెడలు వంచి నష్టపరిహారం అందించేంతవరకు మా పోరాటం ఆగదు. ఈ సమయంలో కూడా కాళేశ్వరం లో నీళ్లు ఎత్తి పోసి నీళ్లు అందించే అవకాశం వున్నా కావాలని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు.జిల్లా మంత్రులు ఎండిన పొలాల వద్దకు పోకుండా రేవంత్ బూట్లు తుడుస్తున్నారని ఘాటుగా విమర్శించారు. జిల్లా మంత్రులు కోమటిరెడ్డి లాంటి చిల్లర నాయకుడుకి కేసీఆర్‌ని విమర్శించే స్థాయి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కరువు పైన సర్వే చేయించి రైతులని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, తదితరులు ఉన్నారు.


*Invitation*

**Small and Medium Daily Newspaper's Association**

Telangana State, Hyderabad (Regd. No. 418/2014)

Cordially invites you to attend

**"SEMINAR"**

on

**"FREE AND FAIR ELECTIONS: HOW TO SAFE GUARD CONSTITUTIONAL RIGHT"**

on Saturday, 30th March 2024, at 10:00 a.m.

at **THE HOTEL PLAZA**, Begumpet, Hyderabad (Tourism Plaza)

**Chief Guest:**

**Shri Ponguleti Srinivasa Reddy** garu,

Hon'ble Minister for Revenue, Housing and Information and Public Relations

**Shri L.V.Subramanyam** garu, (Rtd. IAS), Retired Chief Secretary Govt of AP will speak on " Different measures to be taken to ensure Free and Fair Elections"

**Shri Nimmagadda Rameshkumar** garu (Rtd IAS) Retired Chief Electoral Officer, AP Will deliver keynote address on "Free and Fair Elections: How to safeguard Constitutional right.

**Shri K.Srinivas** garu Editor Andhra Jyothi Daily Will speak on "Free and Fair Elections, Role of Media"

**K.S. Ranga Sayi** Editor, SKYLINE Daily, Chairman Advisory Board

**G. Krishna Reddy** Editor, Prajamargam Daily Chief Organiser

**Tatikonda Krishna** Editor, Satyavartha Daily Convenor

**(Followed by Lunch)**

## సంపాదకీయం

**శనివారం 30-03-2024**

# 'అచ్చే దిన్' పదేళ్లలో ఆవిరైన సంతోషం

వికసిత భారత్' అంటూ బిజెపి చేస్తున్న ప్రచార గాలి తీస్తూ రెండు నివేదికలు తాజాగా వెలువడ్డాయి. ఒకటి ప్రపంచ సంతోష సూచికలో మన దేశ స్థానం గత పది సంవత్సరాల్లో దిగజారింది తప్ప జనానికి అచ్చేదిన్ జాడలేదని స్పష్టం చేసింది. ఐక్యరాజ్య సమితి రూపొందిస్తున్నది గనుక సంతోష సూచికను మేం అంగీకరించం అని బిజెపి తలాయిస్తే కుదరదు. తలసరి జిడిపి, సామాజిక మద్దతు, ఆరోగ్యం, జీవన విధానాన్ని ఎంచుకొనే స్వేచ్ఛ, ఉదారత, ప్రభుత్వం, ప్రైవేటు రంగాలలో అవినీతిని జనం ఎలా చూస్తున్నారనే ప్రాతిపదికల మీద ప్రతి దేశం తెచ్చుకొనే మార్కులను బట్టి సూచికలను ప్రకటిస్తారు. ప్రతి ఏడాది సూచిక అంతకు ముందు రెండు సంవత్సరాల తీరుతెన్నుల ప్రాతిపదిన ఉ ంటుంది. కొన్ని సార్లు పరిగణనలోకి తీసుకొనే దేశాల సంఖ్యలో తేడాలు ఉ ండవచ్చు. అందువలన మార్కులను బట్టి దిగజారిందా మెరుగుపడిందా అన్నది కూడా చెప్పవచ్చు. మన ఇరుగు పొరుగు దేశాల వివరాలను చూద్దాం. 1.సూచిక, మార్కులు అంటే 2014-16 సంవత్సరాలకు సంబంధించి 2017వ సంవత్సర నివేదిక, 2 సూచిక, మార్కులు అంటే 2021-23కు సంబంధించి 2024 నివేదిక వివరాలని (పట్టిక) గమనించాలి.నరేంద్ర మోడీ అధికారానికి వచ్చినపుడు ప్రపంచ జిడిపిలో పదవ స్థానంలో వున్నదానిని ఐదవ స్థానానికి చేర్చారని గొప్పలు చెప్పుకుంటారు. త్వరలో చైనాను అధిగమించి పోతామని అందుకే వికసిత భారత్ అని చెబుతున్నారు. గడచిన పదేళ్లలో చైనాకు పోటీగా దేశాన్ని నిలబెడతానని చెప్పిన మోడీ దానితో పోలిస్తే దేశాన్ని ఎక్కడ ఉంచారో పైన పేర్కొన్న సంతోష సూచికల్లోనే డొల్లతనం వెల్లడైంది. ఉన్నదాన్ని ఉన్నట్లుగా కూడా ఉంచటంలో విఫలమయ్యారు. పదేళ్ల క్రితం ప్రపంచ జిడిపిలో చైనా వాటా 13.1 శాతంగా ఉన్నదాన్ని 2023లో 17.7 శాతానికి పెంచుకోగా మన వాటా 2.6 నుంచి 3.73కు పెరిగింది. పాకిస్తాన్ జిడిపి 2014లో 271.4 బిలియన్ డాలర్ల నుంచి మధ్యలో ఒక ఏడాది 374.66 బి.డాలర్లకు పెరిగి 2023లో 340.64 బి.డాలర్ల వద్ద ఉంది. జిడిపి పెరిగినా సంతోష సూచిక పతనంలో మనకూ పాకిస్తాన్‌కూ తేడా ఏముంది? బిజెపి వారు చెబుతున్నట్లు మనకు అన్నీ ఉన్నా జనాలు ఎందుకు సంతోషంగా లేకపోతున్నారు?నాటి బ్రిటీష్ వలస పాలనలో కంటే నేటి స్వతంత్ర పాలనలో ఆర్థిక అసమానతలు ఎక్కువగా పెరిగినట్లు తాజాగా ప్రపంచ అసమానతల ప్రయోగశాల (వరల్డ్ ఇనీక్వాలిటీ లాబ్) 2024 మన దేశం గురించి ప్రకటించిన విశ్లేషణలో పేర్కొన్నది. నాడు మన జనాన్ని విదేశీ దొరలు దోచుకుంటే నేడు స్వదేశీ దొరలు ఆపని చేస్తున్నారు. అనేక అంశాల మీద అందుబాటులో ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి ఆర్థికవేత్తలు నితిన్ కుమార్ భర్తీ, లూకాస్ ఛాన్సెల్, థామస్ పికెట్టీ, అన్‌మోల్ సోమాంచీ ఒక పత్రాన్ని రూపొందించారు. దానిలో పేర్కొన్న ప్రధాన అంశాలేమిటి? స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1980 దశకం వరకు అసమానతలు తగ్గాయి. తరువాత ముఖ్యంగా 1990 దశకంలో సంస్కరణలు ప్రారంభించిన పదేళ్ల తరువాత విపరీతంగా పెరిగాయి. నరేంద్ర మోడీ ఏలుబడిలో అది మరింత ఎక్కువైంది. 1982 నాటికి దేశంలోని ఎగువ ఒక శాతం మంది రాబడి 6.1 శాతం, అది 2014-15 నుంచి 2022-23 వరకు పరిశీలించినపుడు 22.6 శాతం ఉంటే వారి దగ్గర పోగుబడిన సంపదలు 40.1 శాతంగా ఉన్నాయి. ఎగువ పది శాతం మంది వద్ద 2022 నాటికి దేశ సంపదల్లో 60 శాతం ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా లేదు. అంతరాలు ఎక్కువగా ఉన్నట్లు భావిస్తున్న దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాలలో కూడా ఆదాయ రాబడి వాటా ఇంతగా లేదు. పన్నుల విధానం, ప్రపంచీకరణ దీనికి కారణం. ధనికులుగా ఉన్న 167 కుటుంబాల సంపదపై రెండు శాతం పన్ను విధిస్తే జాతీయ ఆదాయం 0.5 శాతం పెరుగుతుందని అంచనా వేశారంటే సంపద ఎలా గుట్టలుగా పడి ఉందో అర్థం చేసుకోవచ్చు. సక్రమంగా లేని సమాచారం మేరకే తాము అసమానతల గురించి చెబుతున్నామని, నాణ్యమైన, సమగ్ర సమాచారం ఉంటే అసమానతలు ఇంకా ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ధనికుల్లో ఉన్న ఎగువ తరగతిలో కూడా మిగతావారితో పోలిస్తే వారిలో 0.1 శాతం మంది పది శాతం రాబడిని పొందారు. ప్రస్తుతం రెండు భారత దేశాలు కనిపిస్తున్నాయని కొందరు చెప్పిన మాటలను నరేంద్ర మోడీ నిజం చేస్తున్నారు. అందుకే కార్పొరేట్ మీడియా, ధనికుల ప్రతినిధులు మోడీని కోరుకుంటున్నారు.నేటి పాలకులు అధిక జనాభా మన దేశానికి వరం అని ప్రపంచ పారిశ్రామిక కేంద్రంగా మారటానికి అవసరమైన చౌక శ్రామిక శక్తి అందుబాటులో ఉందని తమ జబ్బలను తామే చరుచుకుంటున్నారు. మరోవైపు గత పదేళ్లుగా కేంద్రంలో, వివిధ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాషాయ దళాలు ముస్లిం జనాభా పెరిగి హిందువుల కంటే మెజారిటీగా మారనున్నదనే తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. అది నిజమా, సంతోషం ఆవిరి అవుతున్న స్థితిలో ఏ మతానికి చెందిన వారైనా ప్రతి కుటుంబమూ పరిమితం చేసుకొనేందుకు చూస్తున్నాయని ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వివరాలు వెల్లడిస్తున్నాయి. జననామరణాల రేటును ప్రాతిపదికగా తీసుకున్నపుడు జననాల రేటు 2.1గా ఉండాలని ఆ రంగ నిపుణులు పేర్కొన్నారు. కానీ తాజా సర్వ ప్రకారం రెండు శాతమే ఉన్నందున రానున్న రోజుల్లో జనాభా తగ్గుతుంది తప్ప పెరగదని చెబుతున్నారు. జనాభాలో పదిహేనేళ్ల లోపు వారు 201516లో 28.6 శాతం ఉండగా 201921లో 26.5 శాతానికి తగ్గారు. అంటే కుటుంబాల్లో పిల్లల సంఖ్య తగ్గుతోంది. జమ్ముకాశ్మీరు జనాభాలో 68 శాతం ముస్లింలే ఉన్నారు. అక్కడ జననాల రేటు దేశ సగటు కంటే తక్కువగా 1.4 శాతమే ఉంది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ముస్లిం జననాల సగటు కంటే కూడా ఇది తక్కువ. విద్య, ఉపాధి, వైద్య, ఆరోగ్య రంగాల్లో కేటాయింపులు ఎక్కువగా ఉండి జనాల పరిస్థితి మెరుగుపడితే కులం, మతంతో నిమిత్తం లేకుండా కుటుంబ నియంత్రణ ఎవరికి వారు పాటిస్తారన్నది అందరికీ తెలిసిన సత్యం.రెండు సంవత్సరాల క్రితం ఆక్స్‌ఫామ్ ఇండియా సంస్థ వెల్లడించిన విశ్లేషణ ప్రకారం కేవలం 98 మంది ధనికులైన భారతీయులు రూ.49.15 లక్షల కోట్ల సంపదలను అదుపు చేస్తుండగా పేదల్లోని 55.5 కోట్ల మంది దగ్గర అంత ఉందని పేర్కొన్నది. 2021లో ఒక వ్యక్తి జాతీయ ఆదాయ సగటు రూ.2,04,200గా లెక్కించగా దిగువ 50 శాతం మంది ఆదాయం రూ.53,610 ఉంది. ఎగువ పదిశాతం మంది జనాల సగటు రాబడి రూ.11,66,520గా ఉంది. కరోనా తరువాత పేదలలో 20 శాతం మంది రాబడి 2020-21లో 53 శాతం తగ్గగా ఇదే సమయంలో ఎగువ 20 శాతం మంది రాబడి 39 శాతం పెరిగింది. కరోనా కారణంగా ఆరు కోట్లుగా ఉన్న పేదలు 13.4 కోట్లకు పెరిగారు. వైద్య ఖర్చుల కారణంగా 2017లో 5.5 కోట్ల మంది పేదరికంలోకి దిగజారారు. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా దిగువ తరగతి జనాల రాబడి పెరగకపోతే వారి జీవితాలు అతలాకుతలం అవుతాయి. విద్య, వైద్య రంగాల నుంచి ప్రభుత్వాలు తప్పుకుంటూ ప్రయివేటు వారిని ప్రోత్సహిస్తున్నాయి. రుణగ్రస్తులు కావటానికి వీటి మీద పెట్టే ఖర్చు కూడా ఒక అంశంగా మారింది. జిడిపిలో విద్య మీద ఆరు శాతం ఖర్చు పెట్టాలన్నది లక్ష్యం. కానీ నరేంద్రమోడీ తొలి ఐదు సంవత్సరాలలో మూడు శాతానికి మించలేదు, ఏటేటా తగ్గుతున్నది. జిడిపిలో ఐదవ స్థానానికి దేశాన్ని చేర్చామని

# ఫోన్ ట్యాపింగ్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు !

హైదరాబాద్,తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ సంచలన విషయాలు బయటికొస్తున్నాయి. ఇందులో ప్రధానంగా నాటి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తన అధికారం నిలుపు కోవడంతో పాటు..విపక్ష పార్టీలను సర్వనాశనం చేయడం..బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడడం, వ్యాపారుల వద్ద డబ్బులు లాగడం వంటి అనేక అక్రమాలకు పాల్పడ్డట్లుగా విచారణలో బయటపడుతోంది.ప్రాంతీయ పార్టీలు ఎంతగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతాయనడానికి కెసిఆర్ ప్రభుత్వ ఫోన్ ట్యాపింగ్ పెద్ద ఉదాహరణ. అందుకే వరుసగా రెండోసారి విజయం సాధించారు. మూడోసారి కూడా విజయం తప్పదన్న ధీమాలో ఉన్నా లెక్క తప్పింది. ఇప్పుడు నాటి అక్రమాలు ఒక్కొటి వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేయడమే గాకుండా, అవినీతి అక్రమాలకు పాల్పడ్డ నేతగా కెసిఆర్ చరిత్ర సృష్టించారు. ఇందుకు మూల్యం చెల్లించుకున్నారు. ఇంకా చెల్లించుకోబోతున్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఇప్పటికే దర్యాప్తులో కీలక విషయాలను రాబట్టిన ఉన్నతాధికారులు మరింత వేగం పెంచారు. ఈ కేసులో మరో ఇద్దర్ని.. పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలిస్ స్టేషన్‌లో ఆ ఇద్దర్నీ పోలీసు అధికారులు విచారిస్తున్నారు. కాగా ఈ ఇద్దరు కూడా పోలీసు అధికారులే కావడం గమనార్హం. ఆ ఇద్దరు అధికారులను అదుపులోనికి తీసుకున్న పోలీసులు.. లోతుగా విచారణ చేపడుతు న్నారు. ముఖ్యంగా.. ఈ కేసులో నిందితుడైన ప్రణీత్‌రావుతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. విచారించిన తరవాత ఆ ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాగా.. ప్రణీత్‌కు సహకరించిన ప్రతి ఒక్కర్నీ విచారించాలని దర్యాప్తు బృందం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే మాటల యుద్ధం జరుగుతోంది. ట్యాపింగ్ వ్యవహారంలో వీరు కూడా కీలక పాత్రధారులు అని తెలుస్తోంది. ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పక్క రాష్ట్రాలను కూడా తాకినట్లు దర్యాప్తు అధికా రులు గుర్తించారు. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.ఇప్పటికే మాజీ బిజెపి ఎమ్మెల్యే డిజిపికి ఫిర్యాదు చేశారు. తానే మొదటి బాధితుడినని అన్నారు. కెసిఆర్,కెటిఆర్, హరీష్ రావులపై విచారణ కోరారు. ఇకపోతే ఇది వ్యాపారవర్గాలను బెదరించి సొమ్ము చేసుకోవడానికి కూడా ఉపయోగించారు. సినిమాల్లో జరిగినట్లుగానే ఇదంతా జరగడం ఆశ్యరకరంగా ఉంది. రియల్ ఎస్టేట్ పరంగా కీలకమైన జోన్లు కావడంతో.. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసి, విధేయతను చాటుకున్నారని సమాచారం. సదరు డీసీపీ గత ప్రభుత్వ పెద్దలకు సమీప బంధువు కావడంతో.. సీపీ స్థాయి అధికారి కూడా ఆయన చర్యలను పెద్దగా పట్టించుకునే వారు కాదని భావిస్తున్నారు. ఎస్ఐబీలో సేవలందించిన 15 మంది అధికారులు, సిబ్బందికి ఈ కేసుతో సంబంధాలున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వీరంతా ఏళ్ల తరబడి ఇంటెలిజెన్స్‌లో పాతుకు పోయినట్లు తెలుస్తోంది. కొందరైతే ఎస్పీ,డీఎస్పీ స్థాయిలో పదవీ విరమణ చేసినా..ఓఎస్డీలుగా కొనసాగారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు శివారు కమిషనరేట్‌నూ తాకిన సంగతి తెలిసిందే.ఇప్పటికే హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్ రావు పేరు వెలుగులోకి రాగా.. తాజాగా శివారు కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ మాదిరి విభాగానికి(ఎస్‌వోటీ) ఇన్‌చార్జిగా



వ్యవహరించిన డీసీపీ పాత్రను దర్యాప్తు అధికారులు గుర్తించారు. నాన్-క్యాడర్ అధికారే అయినా.. ఆయన ఆ కమిషనరేట్‌లో రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత కీలకమైన దాదాపు అన్ని జోన్లకు డీసీపీగా పనిచేసినట్లు సమాచారం. సదరు అధికారి తన టీమ్‌తో కలిసి రూ.కోట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు పంజాగుట్ట పోలీసులు అనుమానిస్తున్నారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో కార్యాలయం కేంద్రంగా సాగిన అక్రమఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. దీనికి ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ (ఐటీఏ)ను కూడా జత చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైనప్పుడు, ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్నల అరెస్టు సమయంలో ఈ చట్టంలోని సెక్షన్ల మేరకు ఆరోపణలు లేవు. తాజాగా ఈ చట్టాన్ని జోడించిన అధికారులు ఈ మేరకు నాంపల్లి కోర్టుకు మెమో ద్వారా సమాచారమిచ్చారు. మరోపక్క ఈ కేసులో నిందితులపై నేరం నిరూపించ డానికి అవసరమైన చర్యలను సిట్ అధికారులు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఎస్ఐబీలో ఎలక్ట్రిషియన్‌గా పని చేసిన టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌ను సాక్షిగా చేర్చారు. ట్యాపింగ్‌పై ఎస్ఐబీ అదనపు ఎస్పీ డి.రమేష్ ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ప్రణీత్ రావు, ఇతరులపై ఈ నెల 10న కేసు నమోదైంది. దీనికి సంబంధించిన ప్రాథమిక సమాచార నివేదికలో పోలీసులు మూడు చట్టాల్లోని తొమ్మిది సెక్షన్ల కింద ఆరోపణలు చేశారు. ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల్లోని సెక్షన్లు చేర్చారు. కాగా ఈ నెల 13న ప్రణీత్ అరెస్టు తర్వాత కోర్టులో రిమాండ్ కేసు డైరీని సమర్పించిన అధికారులు.. ఇందులో ఓ సెక్షన్ తగ్గించి ఎనిమిదింటి కిందే ఆరోపణలు చేశారు. ఎస్ఐబీని చాలాకాలం పాటు పదవీ విరమణ పొంది ఓఎస్డీలుగా పనిచేస్తున్న వాళ్లే నడిపినట్లు తెలిసింది. ఇలాంటి దాదాపు 15 మంది అధికారులను ఆధారంగా చేసుకుని కథ నడిపినట్లు సమాచారం. ఓ మాజీ డీఐజీ, ముగ్గురు మాజీ ఎస్పీలు, ఐదుగురు అదనపు ఎస్పీలు ఇందులో కీలకంగా పనిచేశారని తెలుస్తోంది. అయితే ప్రభుత్వం మారిన తరవాత ప్రభాకర్‌రావుతో పాటే వీళ్లు కూడా రాజీనామా చేసి వెళ్లిపోయారు. సాధారణంగా ఎస్ఐబీ లాంటి సున్నిత విభాగాల్లో మాజీ అధికారులను, ప్రైవేట్ వ్యక్తులను కీలక స్థానాల్లో ఉంచరని, అయితే ప్రభాకర్‌రావు స్వయంగా ఓఎస్డీ కావడంతో ఎస్ఐబీలో ఓఎస్డీలతో పాటు ప్రైవేట్ వ్యక్తుల రాజ్యం నడిచిందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. మరోపక్క ప్రణీత్‌రావుకు ట్యాపింగ్ వ్యవహారంలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు సహకరించినట్లు సిట్ తేల్చింది.

# ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువే



హైదరాబాద్, మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగితే రిపేర్ చేయించేందుకు సీఎంకు టైం సరిపోవటం లేదా? అని ప్రశ్నించారు. 3 పిల్లర్ల వద్ద కాఫర్ డ్యాం కట్టి, వృథాగా సముద్రంలోకి పోతున్న నీటిని పంపింగ్ చేసి ఉంటే ఈరోజు ఈ దుస్థితి వచ్చేది కాదని తెలిపారు. అందుకే ఇది కాలం తెచ్చిన కరువు కాదని, పక్కా కాంగ్రెస్ తెచ్చిన కరువేనని విమర్శించారు. పంటలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతుంటే పరామర్శించే తీరికలేదు గానీ, గత 4 నెలలుగా 15 సార్లు విమానం ఎక్కే, విమానం దిగే అన్నట్టు ఢిల్లీకి జాతర పోవుడు, యాత్రలు చేసుడు తప్ప ఇంతవరకు సీఎంగానీ, మంత్రులుగానీ రైతుల పొలాల దిక్కుచూసిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు.వేసిన పంటలు మేతకు తప్ప ఎందుకూ పనికిరాకుండా పోయాయని అన్నారు. రైతుల గోస చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగిలో రైతుబంధు కోసం పెట్టిన రూ.7 వేల కోట్లను రైతులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్ల ఖజానాకు, వారి పేమెంట్లకు పెట్టిన చిల్లర ప్రభుత్వమని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, ఎన్నికల కోడ్ అడ్డురాకుండా ఎన్నికల కమిషన్‌కు ప్రత్యేక లేఖ రాసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో కౌలు రైతు జింకా పరశరాములుకు చెందిన ఎండిన వరిపంటను కేటీఆర్ పరిశీలించారు. పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయానంటూ కంటతడిపెట్టిన రైతును ఓదార్చి, అధైర్యపడవద్దని, అండగా కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం ఉన్నామని భరోసా ఇచ్చారు. అనంతరం సిరిసిల్ల, వేములవాడలో జరిగిన పలు శుభకార్యాలకు హాజరయ్యారు. చీర్లవంచలో 'నమస్తేతెలంగాణ' బ్యూరో ఇన్‌చార్జి కడపర్తి ప్రకాశ్‌రావు కుటుంబసభ్యులను పరామర్శించారు. బీవైనగర్‌లోని షాదీఖానాలో ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. సిరిసిల్లలోని 33వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నేత మూడం సాయికుమార్‌ను పరామర్శించారు. ఇటీవల పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని సాయికుమార్ గాయాలపాలయ్యారు. మెరుగైన వైద్యం అందిస్తామని ఆయనకు భరోసా ఇచ్చారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

'రైతులు అధైర్యపడొద్దు. అండగా మేమున్నాం. దయచేసి చేతులు జోడించి మొక్కుతున్నా ఆత్మహత్యల్లాంటి తీవ్రమైన చర్యలకు పాల్పడి కుటుంబాలను ఇబ్బందులపాలు చేయొద్దు' అని రైతులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'కొంత మోసపోయి కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపించుకున్నారు. మిమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోనప్పటికీ, మంత్రులు, సీఎంకు తీరిక లేకపోయినా? మీ తరఫున మేముంటాం' అని తెలిపారు. ప్రతి గ్రామానికి వస్తామని, మీ కోసం కేసీఆర్ స్వయంగా వస్తున్నారని ధైర్యం చెప్పారు. ప్రభుత్వ మెడలు వంచైనాసరే నష్టపరిహారం సాధించుకుందామని, మేడిగడ్డ రిపేర్ చేయించి కాళేశ్వరం నీళు తెచ్చుకుందామని, ధాన్యానికి బోనస్, రుణమాఫీ సాధించుకుందామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పెట్టిన ఆరు డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల్లో భరోసా నింపేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్తు మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పూసపల్లి సరస్వతి, బీఆర్ఎస్ నాయకులు గజభీంకార్ రాజన్న ఉన్నారు.

ప్రభుత్వానికి 6 డిమాండ్లు

రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రైతుభరోసా రూ.15 వేలు ఇవ్వాలి.

కౌలురైతులకు, రైతుకూలీలకు ఇస్తానన్న పైసలు వెంటనే ఇవ్వాలి.

ప్రభుత్వ నిర్లక్ష్యం, చెరువులు నింపకపోవటం, నీళ్లు ఇవ్వనందుకే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇస్తూ ఆర్డర్ తెచ్చింది. రైతులపై చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి.

కోతకు వచ్చిన పంటలను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి.

రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి. రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ముందుకు రావాలి.

## ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నాలు

హైదరాబాద్,మనిషి ఎదుగడానికి అభివృద్ధి మార్గాలు తెరిచి పెట్టడమే పేదరిక నిర్మూలన పథకాల లక్ష్యం కావాలని ఐక్యరాజ్య సమితి ఘోషిస్తున్నది. ఈ భావనతోనే అభివృద్ధి వ్యూహాలకు రూపకల్పన చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర పాలకులకు ప్రచారార్భాటమే తప్ప పేదరిక నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ప్రకటించలేదు. అందుకే ప్రజలకు దానిపై ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. బడ్జెట్ అంటే సంవత్సరానికొక్కమారు ప్రభుత్వాలు చట్టసభల్లో ప్రవేశపెట్టే తద్దినంగా ప్రజలు భావించే స్థితి వచ్చిందంటే దానికి కారణం పాలకులు వాటిని వాస్తవ పరిస్థితులకు దూరంచేసి అంకెల గారడీగా మార్చడమే. పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడం, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు జవజీవాలు సమకూర్చడం, కులవృత్తులకు ఆలంబన, గ్రామీణ సమాజాన్ని అభివృద్ధి కాముకమైనదిగా చూడటం మొదలైనవన్నీ ఆర్థిక ప్రగతికి దోహద పడతాయి. ఎవరు ఉన్నా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దిగజారింది. కులవృత్తులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చిన్ననీటి పారుదల రంగం వట్టి పోయింది. ప్రాజెక్టులు, మేఘమథనం పేరుతో ఉమ్మడి ఎపిని దోచుకుతిన్నారు. గతంలో బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చూపించడం ఖర్చుల్లో కోతలు పెట్టడం ప్రభుత్వాల ఘన కార్యాలుగా చెప్పుకున్నారు. బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించడం, భారాలు తరువాత వేయడం కూడా మరో ఎత్తుగడ వేయడం కాంగ్రెస్ హయాంలో

# విపక్ష నేతలే టార్గెట్..

హైదరాబాద్,లోక్‌సభ ఎన్నికలు సమీపించిన వేళ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులను తీవ్రతరం చేసింది. కేసులు.. నోటీసులు.. సోదాలతో ఆయా పార్టీల నేతలను ఒత్తిడికి గురిచేస్తున్నది. బుధవారం వివిధ రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీని లక్ష్యంగా చేసుకున్నది. ఆ పార్టీ ఢిల్లీ నేత దీపక్ సింగ్లా నివాసంలో సోదాలు జరిపింది. ఆప్ అధికారంలో ఉన్న మరో రాష్ట్రమైన పంజాబ్‌లోనూ తనిఖీలు చేపట్టింది. ఆ పార్టీ బలంగా ఉన్న గోవాలో పార్టీ కన్వీనర్‌కు నోటీసులు జారీ చేసింది. కేరళ సీఎం విజయన్ కుమార్తె వీణా విజయన్‌పై కేసు నమోదు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ మహువా మొయిత్రాకు నోటీసులు జారీ చేసింది. ఉత్తరాఖండ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత హరక్ సింగ్ రావత్‌కూ నోటీసులు ఇచ్చింది. మరోవైపు, మద్యం పాలసీ కేసులో ఈడీ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించలేదు. అరెస్ట్ విషయంలో జోక్యం చేసుకునేందుకు కోర్టు నిరాకరించింది. మరోవైపు మద్యం విధానానికి సంబంధించిన నిజానిజాలను కేజ్రీవాల్ కోర్టులోనే వెల్లడిస్తారని ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్ చెప్పారు.కేరళ సీఎం విజయన్ కుమార్తె వీణా విజయన్‌పై ఈడీ కేసు నమోదు చేసింది. వీణాకు చెందిన ఐటీ కంపెనీ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు కొచ్చిన్ మినరల్స్ అండ్ రీటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అక్రమంగా చెల్లింపులు చేసిందన్న ఆరోపణలతో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసినట్టు ఈడీ అధికారులు తెలిపారు.

అసలేమిటీ కేసు?

సీఎంఆర్ఎల్ అనే సంస్థ వీణాకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి 2018-19 మధ్య రూ.1.72 కోట్లు అక్రమ చెల్లింపులు చేసినట్టు ఐటీ శాఖ గుర్తించింది. ఎలాంటి సేవలను అందించకుండానే ఎక్సాలాజిక్‌కు సీఎంఆర్ఎల్ ఈ చెల్లింపులు చేసినట్టు ఐటీ శాఖ పేర్కొంది. దీంతో ఎక్సాలాజిక్‌పై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయం (ఎస్ఎఫ్ఐఒ) విచారణ జరిపి అక్రమంగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించింది. ఇది పరిగణనలోకి తీసుకొని ఈడీ కేసు నమోదు చేసింది.

మహువాకు ఈడీ నోటీసులు

తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం మరోసారి సమన్లు జారీ చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘన కేసులో భాగంగా గురువారం విచారణకు హాజరుకావాలంటూ నోటీసుల్లో పేర్కొంది. దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త దర్శన్ హీరానందానికి కూడా సమన్లు పంపింది.కాగా, ప్రశ్నలకు ముడుపుల కేసులో ఇంతకుముందు రెండు సార్లు మహువాకు ఈడీ సమన్లు జారీ చేసినా విచారణకు ఆమె హాజరుకాలేదు. ఇదే కేసులో గత శనివారం సీబీఐ మహువా నివాసాల్లో, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. తాజాగా ఈడీ మూడోసారి ఆమెకు సమన్లు జారీ చేసింది. పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణల కేసులో మహువాపై విచారణ చేపట్టాలని సీబీఐని లోక్‌పాల్ ఆదేశించింది.

గోవా ఆప్ చీఫ్‌కు ఈడీ సమన్లు

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో గోవా ఆప్ కన్వీనర్ అమిత్ పాలేకర్, పలువురు పార్టీ నేతలకు ఈడీ సమన్లు జారీచేసింది. ఈ నెల 28(గురువారం) పనాజీలోని ఈడీ కార్యాలయానికి విచారణకు హాజరు కావాలని అందులో కోరినట్టు అధికారిక వర్గాలు బుధవారం వెల్లడించాయి. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో అమిత్ పాలేకర్ ఆప్ సీఎం అభ్యర్థిగా ఉన్నారు. ఆయన ఇటీవల మాట్లాడుతూ గోవా ఎన్నికల ప్రచారం కోసం అక్రమ సొమ్ము పంపించారనే ఆరోపణలకు ఏ ఆధారాలు లేవని, ఎలాంటి దర్యాప్తుకైనా తమ పార్టీ నేతలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

పంజాబ్‌లో అధికారుల ఇండ్లలో సోదాలు

ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన తర్వాత ఈడీ ఇప్పుడు పంజాబ్‌పై దృష్టి సారించినట్టు కనిపిస్తున్నది. జామతోటల నష్టపరిహారానికి సంబంధించిన కేసులో బుధవారం ఈడీ అధికారులు చండీగఢ్, మొహాలీ, పాటియాలా, ఫిరోజ్‌పూర్, బతిండ ప్రాంతాల్లోని పలువురు అధికారులు, ప్రైవేటు వ్యక్తుల ఇండ్లలో సోదాలు నిర్వహించారు. పంజాబ్ ఎక్సైజ్ కమిషనర్ వరుణ్ రూజమ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. జామతోటల నష్టపరిహారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వరుణ్ రూజమ్ భార్య సిమ్రత్‌ప్రీత్ కౌర్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఫిరోజ్‌పూర్ డిప్యూటీ కమిషనర్ రాజేశ్ ధిమమ్ ఇంట్లోనూ ఈడీ బృందాలు సోదాలు జరిపాయి. రాజేశ్ భార్య జాస్మీన్ కూడా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నిరసన ర్యాలీకి సన్నద్ధమవుతున్న వేళ

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆదివారం ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఆప్ సన్నద్ధం అవుతున్న వేళ ఈడీ పంజాబ్‌లో రంగంలోకి దిగడం గమనార్హం.

దిలీప్ ఘోష్, సుప్రియా శ్రీనేత్‌కు ఈసీ నోటీసులు

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కంగనా రనౌత్‌లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనాథేలకు ఎన్నికల సంఘం బుధవారం వేర్వేరుగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారి వ్యాఖ్యలు అగౌరవంగా, దురుద్దేశంతో కూడుకుని ఉన్నాయని ఈసీ వ్యాఖ్యానించింది.ప్రాథమిక ఆధారాలను బట్టి వీరిద్దరూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని స్పష్టమవుతున్నదని పేర్కొంది. తాము పంపిన షోకాజ్ నోటీసులకు ఈ నెల 29 సాయంత్రం లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు గౌరవంతో, హుందాగా వ్యవహరించాలని ఈసీ ఈ సందర్భంగా సూచించింది.ఎన్నికల సందర్భంగా ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రం కుమార్తెనని మమతా బెనర్జీ చెపుతున్నారని,ఇంతకీ ఆమె తండ్రి ఎవరో స్పష్టం చేయాలని దిలీప్ ఘోష్ వివాదాస్పద వ్యాఖ్యలు విషయం తెలిసిందే.

కాంగ్రెస్ మాజీ మంత్రి హరక్‌సింగ్‌కి ఈడీ నోటీసులు

ఉత్తరాఖండ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత హరక్ సింగ్ రావత్‌కు ఈడీ తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది. మనీ లాండరింగ్ కేసులో ఏప్రిల్ 2న తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి ఈడీ ఫిబ్రవరి 7న హరక్ సింగ్ ప్రాంగణాలపై దాడి చేసి 1.2 కోట్ల నగదు, బంగారం, ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకుంది. ఫిబ్రవరి 29న తమ ముందు హాజరు కావాలని నోటీసులు పంపినప్పటికీ, వేరే పని ఉన్నందున దానిని వాయిదా వేయాలంటూ ఆయన కోరారు. దీంతో ఈడీ తాజాగా మరోసారి నోటీసులు పంపింది.

## ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు పోలీసులు ముమ్మరం చేశారు. 15 మంది అధికారులు చెప్పు చేతుల్లో ఎస్ఐబీ కీలుబొమ్మగా మారింది. అధికారులు ఎస్ఐబి కంట్రోల్ చేసినట్లుగా గుర్తించారు. రిటైర్డ్ ఐజీ ప్రభాకర్‌రావుతో పాటు ఒక మాజీ డీఐజీ నేతృత్వంలో ఎస్ఐబీ నడిచింది. ముగ్గురు మాజీ ఎస్పీలు, ఐదుగురు అదనపు ఎస్పీల కంట్రోల్‌లో ఎస్ఐబీ నడిచింది. అదనపు ఎస్పీ భుజంగరావు, తిరుపతన్నను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా ముగ్గురు అదనపు ఎస్పీలు, ఐదుగురు డిఎస్పీలు అక్కడే తిష్ట

## సదానంద వసంత్‌కు ఎన్ఐఎ డైరెక్టర్‌గా ప్రమోషన్

న్యూఢిల్లీ,: మహారాష్ట్ర 'ఉగ్రవాద వ్యతిరేక దళం' అధిపతిగా ఉన్న సదానంద్ వసంత్ దాతెను 'జాతీయ దర్యాప్తు సంస్థ' ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ పదవిలో ఉన్న దినకర్ గుప్తా ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో రాబోతున్న 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి వసంత్– 2026 డిసెంబరు 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 26/11 దాడిగా పేరొందిన ముంబయి పేలుళ్ల ఘటనలో కీలక ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, అబు ఇస్మాయిల్‌లను పట్టుకున్నది వసంతే. అప్పుడు ఆయన ముంబయి అదనపు పోలీసు కమిషనర్‌గా ఉన్నారు. ఉగ్రవాదులు విసిరిన గ్రనేడ్ పేలి.. కాళ్లూచేతులకు తీవ్రగాయాలై, చాలారక్తం కోల్పోయి తాను స్పృహతప్పి పడిపోయేంతవరకు దాదాపు గంటసేపు ఆయన వీరిద్దరినీ ఆనాడు వదల్లేదు. గ్రనేడ్ తునకలు శరీరాన్ని చీల్చినా వెనక్కి తగ్గకుండా కాల్పులు జరుపుతూ, సీనియర్ అధికారులకు ముఖ్యమైన సమాచారం చెబుతూ ఎదురుదాడి పనిని సులభతరం చేశారు. ఆనాటి సాహసోపేత చర్యకు గానూ ఆయన రాష్ట్రపతి పోలీసు పతకాన్ని కూడా అందుకున్నారు. ఉగ్రదాడుల కేసుల దర్యాప్తు నిపుణుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ముంబయి ఘటన అనంతరం ఉగ్రదాడుల నిర్మూలనకు ఎన్ఐఏ ఆవిర్భవించగా 16 ఏళ్ల తర్వాత ఇప్పుడు దాని పగ్గాలు ఆయన చేతికి దక్కాయి. అధునాతన ఆయుధాలను అలవోకగా వినియోగించగలిగే సామర్థ్యం ఉన్న వసంత్ దాతె.. మరాఠీలో ఒక పుస్తకం కూడా రాశారు. పేద కుటుంబానికి చెందిన ఆయన పుణెలో కొన్నాళ్లు దినపత్రికలు విక్రయించారు. 'జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం' (ఎన్‌డీఆర్ఎఫ్) అధిపతి అతుల్ కర్వాల్ స్థానంలో పీయూష్ ఆనంద్‌ను కేంద్రం నియమించింది. ఆనంద్ ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ ప్రత్యేక డీజీగా ఉన్నారు. 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్, డెవలప్‌మెంట్' డైరెక్టర్ జనరల్‌గా రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐపీఎస్ రాజీవ్ కుమార్ శర్మ నియమితులయ్యారు. ఎస్పీజీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఎస్.సురేశ్‌ను నియమించారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణ

హైదరాబాద్,అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు భారాసను ఓడించి శిక్ష విధించినా ఆ పార్టీ నేతలు అహంకారాన్ని వీడటం లేదని భాజపా ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియంతృత్వాన్ని పాటించే వాళ్లు నీడను కూడా నమ్మరన్నారు. కేసీఆర్ కూడా ఎవరినీ నమ్మలేదని.. అందుకే రాజకీయ, మీడియా ప్రముఖులపై ఫోన్ ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. కేంద్ర హోం శాఖ అనుమతి లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో హార్డ్ డిస్కులు, సమాచారాన్ని ధ్వంసం చేశారు. రెండో, మూడో ఫోన్ ట్యాపింగ్‌లు జరిగితే జరగవచ్చని కేటీఆర్ అంటున్నారు. దీనికి మూల కారకులు కేసీఆర్, కేటీఆర్ అని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి దీనిపై సీబీఐ విచారణ చేయించాలన్నారు. మద్యం కుంభకోణంలో కవిత పాత్ర ఉంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల్లో ఆ కుటుంబానికి ప్రమేయం ఉందన్నారు. తెలంగాణ సంపదను దోచకున్న వారికి శిక్ష పడాలని ప్రజలు కోరుకుంటున్నారు. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి కదలలేదు. సచివాలయానికి ఒక్కసారి కూడా వెళ్లలేదు. గత ప్రభుత్వంలో ప్రతి పథకంలో స్కామ్‌లు చేశారు.. కమిషన్లు తీసుకున్నారు. ప్రశ్నించే వారిని బెదిరింపులకు గురిచేశారు. నియంతృత్వ పోకడలతో పాలన సాగించారని లక్ష్మణ్ మండిపడ్డారు. కక్ష సాధింపులో భాగంగా పలువురిపై ఫోన్ ట్యాపింగ్ చేశారు. అసెంబ్లీ, ఉప ఎన్నికల సమయంలో రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిచారు. ఈ కుంభకోణంలో కొంత మంది పోలీసు అధికారులు ఏ రకంగా అక్రమార్జనకు పాల్పడ్డారో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించింది. ఇది తీవ్రమైన నేరం అని లక్ష్మణ్ ఆరోపించారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో దుమారం రేపుతోంది. ఈ తరుణంలో పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ తరుణంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.. కేటీఆర్ మాటలను బట్టి.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని బహిరంగంగానే ఒప్పుకున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని విమర్శించారు. ఈ రెండు పార్టీల పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని డాక్టర్ లక్ష్మణ్ విమర్శించారు. పోలీసులేమో నేతలు చెప్తే ఫోన్ ట్యాపింగ్ చేశామని అంటున్నారని.. కెటిఆర్ ఒక్కరిద్దరి ఫోన్లు ట్యాప్ అయ్యి ఉండొచ్చు అని మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయకుండా.. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇటువంటివి వాటిని తెర మీదకి తెస్తున్నారనే అనుమానం కల్గుతుందన్నారు. బీఆర్ఎస్ అవినీతి ఎక్కడ బయట పడతాది అనే అభద్రత భావంతో కేటీఆర్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. ఉప ఎన్నిక ల సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసారంటూ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కి మూల కారణం కేసిఆర్ అని కాంగ్రెస్ చెప్తుందని.. దీని వెనకాల ఉన్న వారందరూ బయటికి రావాలంటే ఈ కేసును సీబీఐకి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐ ఎంక్వయిరీకి అప్పజెప్పి రేవంత్ లీకువీరుడు కాదు గ్రీకువీరుడు అని నిరూపించుకోవాలన్నారు.. తన ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందో లేదో విచారణ జరిపి తేల్చాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉంటే.. ఇదే కేసు విషయంలో కీలక విషయాలను బయట పెట్టాలని రఘునందనరావు కూడా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి కూడా తన ఫోన్ ను ట్యాపింగ్ చేశారని ఏకంగా డీజీపీకి ఫిర్యాదు చేశారు.

## నిజ్జార్ హత్య దర్యాప్తుపై స్పందించిన కెనడా ప్రధాని

న్యూఢిల్లీ, భారత్ ప్రకటించిన ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యకు సంబంధించిన దర్యాప్తుపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందించారు. హత్యపై తేల్చేందుకు భారత ప్రభుత్వంతో కలిసి నిర్మాణాత్మకంగా పనిచేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కెనడా పౌరుడు హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్య కేసు దర్యాప్తులో భారతదేశం సహకారంపై ట్రూడోను ప్రశ్నించగా.. కెనడియన్ గడ్డపై కెనడా పౌరుడి హత్య అంగీకరించకూడని విషయమని, చాలా సీరియస్‌గా తీసుకోవాలన్నారు. భారత ఏజెంట్ల ప్రమేయం ఉందని ఆరోపణలున్నాయని.. దాన్ని తాము తేలిగ్గా తీసుకోలేదన్నారు. విదేశీ ప్రభుత్వాల చట్టవిరుద్ధ చర్యల నుంచి కెనడియన్లందరినీ రక్షించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ విషయంపై కెనడా ప్రభుత్వం సరైన విచారణ జరుపుతుందని ట్రూడో చెప్పారు. ఈ విషయంలో భారత ప్రభుత్వంతో నిర్మాణాత్మకంగా పని చేయడానికి ఎదురు చూస్తున్నాం.. ఇది ఎలా జరిగిందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. గతంలో నిజ్జార్ హత్యలో భారత ప్రభుత్వం హస్తం ఉందని గతంలో జస్టిన్ ట్రూడో ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది.

# ఇవిఎంలపై ఇంకా అనుమానాలే!

న్యూఢిల్లీ,బిహెచ్ఇఎల్ తయారు చేసిన మన ఇవిఎం లకు పారిస్‌లో ఉన్న వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సంస్థ ఎలాంటి ధ్రువీకరణ ఇవ్వలేదు. 2002 లో బిహెచ్ఇఎల్ పేటెంట్ కోసం దరఖాస్తు పంపి, తిరస్కరిస్తారనే భయంతో తన అభ్యర్థనను 2006లో వెనక్కి తీసు కుంది. 2010లో మాజీ న్యాయమంత్రి డా. సుబ్రమణ్య స్వామి ది హిందూలో 'బ్యాలెట్ రిగ్గింగ్ ఫలితాలపై కొంత ప్రభావం చూపితే ఇవిఎం చిప్ ద్వారా మొత్తం ఎన్నికలనే స్వాధీనం చేసుకోవచ్చు' అని రాశారు.ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి కూటమి 400 స్థానాలు సాధించాలని మోడీ, వై నాట్ 175 అని జగన్ అంటుంటే వారి ధీమాకి ఆశ్చర్యం కలుగుతుంది. ఫలితాల నిర్ణయాలు తమ చేతుల్లోనే ఉన్నట్లు వారు మాట్లాడుతున్నారు. 2019 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల్లో జగన్ 151 కైవసం చేసుకుంటే అప్పటికి పాలక పక్షమైన టిడిపి కేవలం 23 చోట్ల గెలవడం అనూహ్యామే. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కెసిఆర్ పై వ్యక్తమైనంత జన వ్యతిరేకత అప్పుడు బాబుపై కనబడలేదని చెప్పాలి. అయినా భారీ ఓటమిని చవిచూశారు. మోడీ 400 స్థానాల్లో గెలుపు కోరుకోవడం కూడా అత్యాశే. దక్షిణ భారతంలో 130 సీట్లు పోగా ఉత్తరాన మిగిలేవి 395. అందులో కొద్దీ చోట్లనైనా గెలిచే అవకాశాలున్న పార్టీలు ఎన్నో ఉన్నాయి. ఇలా చూస్తే గతం మాదిరే 300పై చిలుకుతో తృప్తి పడవలసిందే.అయితే ఈ ధీమాల వెనుక ఏమైనా గూడుపుఠాణి ఉందా! ఎన్నికల ప్రక్రియ, ఇవిఎంల నిర్వహణ ప్రభుత్వం కనుసన్నల్లో జరుగుతుంది కాబట్టి వాటిని తారుమారు చేసే అవకాశం వారికి లభిస్తుందా అనే అనుమానం కలుగుతుంది. దానికి బలం చేకూర్చే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మార్చి 18న భారత్ జోడో యాత్రలో భాగంగా ముంబైలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'ఇవిఎంలు లేకుండా మోడీ గెలవలేడు, రాజుగారి ప్రాణం ఇవిఎంల్లోనే ఉంది' అని అన్నాడు. విశేషమేమిటంటే మన ఇవిఎంలు సంపూర్ణంగా సురక్షితమైన ఎన్నిక సాధనాలు అని ఏ ప్రపంచ స్థాయి సంస్థ కూడా నిర్ధారించలేదు. బిహెచ్ఇఎల్ తయారు చేసిన మన ఇవిఎంలకు పారిస్‌లో ఉన్న వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సంస్థ ఎలాంటి ధ్రువీకరణ ఇవ్వలేదు. 2002 లో బిహెచ్ఇఎల్ పేటెంట్ కోసం దరఖాస్తు పంపి, తిరస్కరిస్తారనే భయంతో తన అభ్యర్థనను 2006లో వెనక్కి తీసుకుంది. 2010లో మాజీ న్యాయమంత్రి డా. సుబ్రమణ్య స్వామి ది హిందూలో 'బ్యాలెట్ రిగ్గింగ్ ఫలితాలపై కొంత ప్రభావం చూపితే ఇవిఎం చిప్ ద్వారా మొత్తం ఎన్నికలనే స్వాధీనం చేసుకోవచ్చు' అని రాశారు. ఈ రోజుల్లో ప్రపంచంలో హ్యాకింగ్ చేయలేని ఎలక్ట్రానిక్ పరికరమేదీ లేదనేది అందరూ ఒప్పుకొనే సత్యం.గోవాలో ఈ నెలలోనే గోవాన్స్ అజినెస్ట్ ఇవిఎమ్స్ అని ఆందోళన చేపట్టారు. పంజాబ్ లోను అంబేద్కర్ నవయువక్ దళ్ తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తోంది. చాలా కాలంగా మేము ఈ సమస్యను లేవనెత్తుతూనే ఉన్నాము, 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున మళ్లీ ప్రజల దృష్టికి తీసుకు రావడానికి మేము ఈ ప్రచారాన్ని ప్రారంభించాం అని ఆ సంస్థ అధ్యక్షుడు బన్సీ లాల్ ప్రేమి అన్నారు. ఇవిఎంలను హ్యాక్ చేయవచ్చని ఎవరైనా నిరూపించాలని ఎన్నికల సంఘం కోరినప్పుడు సుప్రీంకోర్టు న్యాయవాదుల నేతృత్వంలోని ఇవిఎం హటావో దేశ్ బచావో మోర్చా సవాలును స్వీకరించిందని ప్రేమి చెప్పారు. తమకు యాభై యంత్రాలను అందించాలని, ఆ యంత్రాలను ఎలా తారు మారు చేస్తారో నిరూపిస్తామని అ సంస్థ అంది. అయితే ఇది ఇవిఎంల చట్టపర రక్షణ వ్యవస్థకు భంగకరంగా ఉందని ఎన్నికల సంఘం నిరాకరించింది.గత సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా వివిధ పార్టీలు పేపర్ బ్యాలెట్‌లకు తిరిగి తేవాలని లేదా ఓటర్– వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిపిఎటి)ను మెరుగుపరచాలని డిమాండ్ చేశాయి. ఓటు వేసిన అభ్యర్థి గుర్తుతో కూడిన ప్రింటెడ్ పేపర్ స్లిప్ సీలు చేసిన పెట్టెలో వేయడానికి ముందు ఓటరుకు ఏడు సెకన్ల పాటు కనిపిస్తుంది. దాని కాపీని ఓటరుకు ఇవ్వాలని, అంతే కాకుండా ఆ స్లిప్‌పై ఓటు వేసిన తేదీ, సమయం కూడా ఉండాలని కాంగ్రెస్ నాయకులు సుప్రీం కోర్టులో పిటిషన్ కూడా వేశారు. అభ్యర్థులు కోరిన చోట వివి పాట్ చిట్టీలను



లెక్కించాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్ దాఖలు చేసిన పిటిషన్‌కు ప్రతిస్పందనగా ప్రతి ఎన్నికలలో అన్ని స్లిప్పులను లెక్కించినట్లయితే, అది పరోక్ష మార్గాల ద్వారా పేపర్ బ్యాలెట్‌లను తిరిగి ప్రవేశపెట్టినట్లే అవుతుందని సుప్రీం కోర్టు పేర్కొంది.సాంకేతిక నిపుణుల్లో కూడా ఇవిఎంల విషయంలో ఏకాభిప్రాయం లేదు. వీటి వల్ల పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరగడానికి అవకాశం లేదని కొందరు నిపుణులు వాదిస్తున్నప్పటికీ, ఎంపిక చేసిన చోట్ల తారుమారు జరగవచ్చని కొందరు సూచిస్తున్నారు. అప్పుడప్పుడు కొన్ని ఓట్లు వేరే పార్టీకి వెళ్లడం చూశాం. కానీ 20 లక్షల యంత్రాలలో ఇది నాలుగైదింట్లో జరుగుతుంది. అందువల్ల మొత్తం వ్యవస్థను వ్యతిరేకించడం తప్పు. అయితే ఆ రకమైన అవకతవకలను ఎలా ఆపాలి, నిరోధించాలి అనేది ముఖ్యం అని మాజీ ప్రధాన ఎన్నికల సాధికారి ఖురేషి అన్నారు. ఎన్నికలను తారుమారు చేయడం బ్యాలెట్ బాక్సులను నింపే పాత రోజులు కావివి.ఇప్పుడు మీరు శాసనసభలో మెజారిటీని ప్రభావితం చేసే రీతిలో ఎంపికను తారుమారు చేయవచ్చు అని జగదీప్ చోకర్ అనే రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఓట్ల లెక్కింపులో ఇవిఎంలను కంప్యూటర్‌కు కలిపి ఎవరికెన్ని ఓట్లు వచ్చాయో తేలుస్తారు. వాటి ఆధారంగా ఫలితాలను ప్రకటిస్తారు. కంప్యూటర్ లోపల ఏముందో, ఇవిఎంలో ఏముందో తెలియదు. అందుకే వివిపాట్ స్లిప్ లను 100 % లెక్కించాలని, తుది ఫలితాల ప్రకటనకు స్లిప్‌ల లెక్కే పరిగణనలోకి తీసుకోవాలని ఆగస్టు 2023లో 79 మంది రిటైర్డ్ ఐఎఎస్ అధికారులు ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. స్లిప్‌లపై అభ్యర్థి సంఖ్య, పార్టీ మొదలైన వాటి పేరును ముద్రించడంతో పాటు, ఆ కాగితంపై బార్‌కోడ్‌ను కూడా ముద్రించాలి. బార్‌కోడ్ ఆధారంగా లెక్కింపు జరగాలని వారు కోరారు.ముంబైకి చెందిన న్యాయవాది సునీల్ అహ్యా, సోర్స్ కోడ్ ఆడిట్ కోసం ఐఇఇఇ1028 అంతర్జాతీయ ప్రమాణమని, అయితే దీనిని భారత ఎన్నికల సంఘం ఉపయోగిస్తుందా లేదా అనేది తెలియదని కోర్టులో పిల్ వేశారు. ఆ విచారణ సందర్భంగా ఎన్నిక సంఘం సాంకేతిక మూల్యాంకన కమిటీ కోడ్‌ను ఆడిట్ చేస్తుందని, దాని వద్ద సమాచారం అందుబాటులో ఉందని ఎన్నిక సంఘం కోర్టుకు తెలిపింది. మెషీన్‌ల కోసం సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేసే కమిటీ తన స్వంత పనిని ఎలా ఆడిట్ చేస్తుంది, ఇది ఒక స్వతంత్ర ఏజెన్సీ ద్వారా చేయవలసి ఉంటుంది అని ఆయన ఎన్నికల సంఘాన్ని కోరారు. సోర్స్ కోడ్‌లను ఎవరూ రహస్యంగా ఉంచరు. సోర్స్ కోడ్ ఇతర విషయాలతో పాటు పబ్లిక్ చేసిన తర్వాత కూడా యంత్రాలు సురక్షితంగా ఉండాలి. వాస్తవానికి హ్యాకింగ్‌కి తట్టుకొని యంత్రాలు సురక్షితంగా ఉన్నాయని నిరూపించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉంది అని ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ మాజీ ప్రొఫెసర్ సుభాషిస్ బెనర్జీ అభిప్రాయపడ్డారు.పైన పేర్కొన్న సమాచారమంతా నిపుణులు, విశ్లేషకుల మాటల్లోంచి సేకరించిందే. ఇలా ఇవిఎంలపై అనుమానాలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న చోట ఎన్నికల ప్రక్రియకు అర్థమేమిటి? ఇవిఎంలు వాడుతున్న కొన్ని దేశాలు ప్రజల, పార్టీల కోరిక మేరకు వాటిని పక్కనపెట్టాయి. మన దేశంలో కూడా వీటి వినియోగంపై రెఫరెండం కోరితే ఇలాంటి సందేహాలకు తెరపడింది.

## ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి సిట్ అధికారులు త్వరలో డీజీపీ, అదనపు డీజీపీ స్థాయి అధికారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రధాన కార్యాలయం లక్డీకాపూల్‌లో ఉన్నప్ప టికీ... గ్రీన్‌ల్యాండ్స్‌లోని ఎస్ఐబీ కార్యాలయంలో కూడా ఆయనకు ఓ ఛాంబర్ ఉంది. గడిచిన కొన్నేళ్లుగా నిఘా విభాగాధిపతి అక్కడకు రాక పోవడంతో ప్రణీత్ రావు ఈ ఛాంబర్‌తో పాటు పక్కన ఉన్న రూమ్‌ను తన అక్రమ ట్యాపింగ్ వ్యవహారాల కోసం వార్‌రూమ్‌గా వినియోగించుకున్నట్లు తేలింది. ఆ చాంబర్ ఇతరులు విని యోగించాంటే కచ్చితంగా నిఘా విభాగాధిపతి, డీజీపీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి అప్పట్లో ఏ కారణం చెప్పి ఈ అనుమతి తీసుకు న్నారు? ట్యాపింగ్ వ్యవహారాలు తెలిసే అను మతి ఇచ్చారా? లాంటి సందేహాలు నివృత్తి చేసుకోవడానికి గాను వీరికి నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నల కస్టడీ పిటిషన్లతో పాటు ఈచట్టాన్ని జోడిస్తూ మెమోను కూడా అధికారులు కోర్టులో దాఖలుచేశారు. హార్డ్‌డిస్క్‌ల విధ్వంసంలో ప్రణీత్‌రావుతో కలిసి పాల్గొన్న హెడ్ కానిస్టేబుల్ కైతోజు కృష్ణను ఈ కేసులో సాక్షిగా చేర్చారు. నాటి ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు గత ఏడాది డిసెంబర్ 4న అర్ధరాత్రి కృష్ణతో కలిసే ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ తాను ఏర్పాటు చేసుకున్న వార్ రూమ్‌తో పాటు అధికారిక ట్యాపింగ్‌లు జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను కృష్ణ ద్వారా ఆఫ్ చేయించాడు. అతని సహాయంతో వార్ రూమ్‌లోని 17 కంప్యూటర్లలో ఉన్న వాటితో పాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్ డిస్క్‌ల్నీ ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ధ్వంసం చేశాడు. ఈ కారణంగానే సిట్ అధికారులు కృష్ణను సాక్షిగా చేర్చారు. త్వరలో ఇతడితో న్యాయస్థానంలో స్టేట్‌మెంట్ రికార్డు చేయించాలని నిర్ణయించారు. ఇప్పటికే సిట్ కృష్ణ వాంగ్మూలం నమోదు చేయగా.. భవిష్యత్తులో అతను సాక్ష్యం చెప్పకుండా ఎదురుతిరిగే అవకాశం లేకుండా ఈ చర్య తీసుకోనున్నారు.

## కాంగ్రెస్‌లో ఫ్యామిలీ వార్..

హైదరాబాద్, ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములకే వాడి ఎక్కువన్నట్లు తెలంగాణ రాజకీయాలు మారిపోయాయి. గెలుపు గుర్రాల పేరుతో తెలంగాణ కాంగ్రెస్ వలస నేతలకే పెద్ద పీట వేస్తోంది. బాగా ఆర్థికంగా డబ్బున్న వ్యక్తులను ఇతర పార్టీల నుంచి తీసుకొచ్చి మరీ టికెట్లు కేటాయిస్తోంది. మరోవైపు ఫ్యామిలీ మెంబర్స్ కూడా పార్లమెంట్ టికెట్ రేసులో ఉంటున్నారు. దీంతో కాంగ్రెస్‌లో ముసలం రాజుకుంటోంది. దీనిపై నేరుగా సీఎం ముందే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ టికెట్లు కూడా ఫ్యామిలీ మెంబర్స్ కే దక్కుతున్నాయని అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఇంతకీ తెలంగాణ కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది..? పెండింగ్ సీట్లపై అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది..?

ఇజ్జత్ కా సవాల్

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలను ఇజ్జత్ కా సవాల్ గా తీసుకుంది. మొత్తం 17 పార్లమెంట్ స్థానాల్లో 14 గెలిచి తీరాలని టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. తమ వందరోజుల పరిపాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం అంటూ పదేపదే చాలెంజ్ చేస్తున్నారు. అయితే ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల విషయంలో.. రేసుగుర్రాలంటూ కొత్త సాంప్రదాయానికి తెర దీశారు. ఆర్థికంగా బలమైన నేతలని ఇతర పార్టీల నుంచి తీసుకొచ్చి మరీ టికెట్లు కేటాయిస్తున్నారు. ఈ విషయంలో పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. నిన్నటి వరకు పార్టీని తిట్టిన వారిని.. కార్యకర్తలపై కేసులు పెట్టిన వారిని తీసుకొచ్చి టికెట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.ఇతర పార్టీల నుంచి వచ్చిన పలువురు నేతలకు కాంగ్రెస్ టికెట్లిచ్చింది. చేవెళ్ల తరపున రంజిత్ రెడ్డి, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, మల్కాజ్గిరి నుంచి సునీతా మహేందర్ రెడ్డి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీలకు టికెట్ లు కేటాయించారు. ఈ విషయంలో చాలా మంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ నేత వి.హనుమంతరావు పార్టీ వేదిక మీద ప్రెస్ మీట్ పెట్టి మరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి ఇతర పార్టీ నేతల ఇళ్లకు వెళ్లడం సరైన సాంప్రదాయం కాదంటూ విమర్శలు గుప్పించారు.

గేట్లు తెరిస్తే దొంగలే వస్తున్నారు

ఇక వలస నేతలకు టికెట్లు ఇవ్వడం విషయంలో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ముందే సీనియర్ నేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గేట్లు తెరిస్తే అందరూ దొంగలు వస్తున్నారు అంటూ చురకలంటించారు. చేవెళ్ల పార్లమెంట్ సమీక్షా సమావేశం సందర్భంగా.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి ముందే హాట్ కామెంట్స్ చేశారు. పార్టీలోకి దొంగలు వచ్చి పెత్తనం చేయడం.. కాంగ్రెస్ కార్యకర్తలకు అవమానకరంగా మారింది అంటూ కామెంట్స్ చేశారు. పార్లమెంట్ సమీక్షా సమావేశంలో నేతలు అందరి ముందు.. కేఎల్ఆర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి.ఒక వైపు వలసనేతల అంశం తీవ్ర దుమారం రేపుతుండగా.. మరో వైపు కుటుంబంలోని వారికే టికెట్లు ఇవ్వడమనే అంశం కూడా రచ్చరచ్చగా మారుతోంది. ఇప్పటికే నల్లగొండ పార్లమెంట్ సీటు జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్ రెడ్డికి, పెద్దపల్లి సీటు గడ్డం వివేక్ కుమారుడు వంశీకి కేటాయించారు. ఇందులో గడ్డం వంశీకి సీటు కేటాయింపుపై తీవ్ర దుమారం రేగుతుంది. ఇప్పటికే బెల్లంపల్లి, చెన్నూరు రెండు అసెంబ్లీ సీట్లు గడ్డం వినోద్, గడ్డం వివేక్ ఇద్దరు అన్నదమ్ములకు కేటాయించారు. ఇప్పుడు తాజాగా పెద్దపల్లి పార్లమెంట్ సీటును వివేక్ కుమారుడు వంశీకి కేటాయించడంపై నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హాట్ టాపిక్‌గా ఖమ్మం సీటు

ఇవే కాకుండా పెండింగ్ లో ఉన్న మిగతా సీట్లలో కూడా ముఖ్య నేతల ఫ్యామిలీ మెంబర్స్ బరిలో దిగాలని చూస్తున్నారు. భువనగిరి నుంచి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మికి టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇక ఖమ్మం సీటు అయితే హాట్ టాపిక్‌గా మారింది. ఈ సీటు కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన భార్య నందినికి కావాలని అడుగుతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన సోదరుడు ప్రసాద్ రెడ్డికి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడు యుగంధర్ కు కావాలని కోరుతున్నారు. ఇలా మొత్తం మీద ఫ్యామిలీ మెంబర్స్ టికెట్ల అంశం కాంగ్రెస్ లో హాట్ టాపిక్ గా మారింది.

## న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే కుట్రలు

న్యూఢిల్లీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సుమారు 500 మందికిపైగా న్యాయవాదులు లేఖ రాశారు. న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ లేఖ రాశారు. న్యాయస్థానాల కోసం నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని లేఖలో పేర్కొన్నారు. లేఖ రాసిన వారిలో ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, మనన్ కుమార్ మిశ్రా, ఆదిష్ అగర్వాల్, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్, హితేష్ జైన్, ఉజ్వల వార్, ఉదయ్ హోల్లా, స్వరూపమా చతుర్వేది, సహా దేశవ్యాప్తంగా 500 మందికిపైగా న్యాయవాదులు లేఖ రాశారు. న్యాయవ్యవస్థ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని లేఖలో ఈ లాయర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని 'ప్రత్యేక బృందాలు' న్యాయ పక్రియను ప్రభావితం చేయడానికి.. కోర్టు నిర్ణయాలను ప్రభావితం చేయడానికి 'కొన్ని ప్రత్యేక

# సాగర్‌పై సర్కారు చేతులెత్తేసిందా ?..



హైదరాబాద్, నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందా ? ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించబోమని అసెంబ్లీ వేదికగా తీర్మానం చేసినా.. ఇప్పటివరకు మళ్లీ ఆ అంశంపై స్పందించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రాజెక్టుపై పట్టు కోసం ఏపీ తీవ్రంగా యత్నిస్తున్నది. కేంద్ర జల్‌శక్తిశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను అదునుగా తీసుకుని ప్రాజెక్టు ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ పనులను స్వాధీనం చేసుకోవాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. తెలంగాణ పనులు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఏపీ, తాజాగా ఆ పనులు తామే నిర్వహించుకుంటామని బోర్డుకు లేఖ రాయడం ఏపీ ప్రయత్నాలకు ఉదాహరణగా నిలుస్తున్నది.

ఏపీ సర్కారు దూకుడు

నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వహణ తెలంగాణ, శ్రీశైలం డ్యామ్ నిర్వహణ, మెయింటనెన్స్‌ను ఏపీ సర్కారు చూడాల్సి ఉంది. రాష్ట్ర పునర్విభజన నాటి నుంచీ ఇదే విధానం కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ డ్యామ్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.20 కోట్లతో మరమ్మతులు చేపట్టింది. ప్రధానంగా గేట్ల రబ్బర్‌సీల్స్‌ను మార్చడం, గ్రీజింగ్, రోప్‌ల మార్పిడితోపాటు, గ్యాంట్రీ పట్టాల మార్పిడి, గ్యాలరీ తదితర పనులు కొంతకాలంగా నిర్వహిస్తున్నది. ఇదిలా ఉండగా ఏపీ సర్కారు అక్రమంగా డ్యామ్‌కు కుడివైపు 13వ గేట్‌వరకు, కుడికాలువ రెగ్యులేటర్‌ను ఆక్రమించడం, అటు తరువాత కేంద్రం జోక్యం చేసుకుని సీఆర్పీఎఫ్ బలగాలను అక్కడ ఏర్పాటు చేయడం తెలిసిందే. అంతేకాకుండా డ్యామ్‌కు సంబంధించి తమ భూభాగంలోని మరమ్మతులను ఇరు రాష్ట్రాలు చేసుకోవచ్చని, అందుకు కేఆర్ఎంబీ అనుమతి తప్పనిసరి అని, అనుమతులు ఉంటేనే అధికారులను అనుమతించాలని కేంద్రం సీఆర్పీఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను అదునుగా తీసుకుని ఏపీ దూకుడు పెంచింది. బోర్డు అనుమతితోనే ఏపీవైపున తెలంగాణ చేపట్టిన ఓఅండ్ఎం పనులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలోనే బోర్డుకు ఏపీ లేఖ రాసింది. ఈ మేరకు బోర్డు అధికారులు ఆ ప్రాంతాన్ని గతంలోనే సందర్శించారు. తాజాగా ఏపీ మరో మెలిక పెడుతున్నది. తమ భూభాగంలోని మరమ్మతు పనులు తామే చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని బోర్డుకు మళ్లీ లేఖ రాసింది. దీంతో ఏపీ భూభాగంలోని పనులపై సందిగ్ధత నెలకొన్నది. బోర్డు కూడా ఇప్పటివరకు ఏపీ లేఖపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.


తీర్మానంతోనే సరిపెట్టిన సర్కార్

సాగర్ డ్యామ్ వివాదంపై తెలంగాణ సర్కారు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నదని ఇంజినీరింగ్ అధికారులే చర్చించుకుంటున్నారు. సాగర్ డ్యామ్‌ను ఏపీ ఆక్రమించుకున్న తరువాత జనవరి17న కేంద్ర జలశక్తిశాఖ తొలి సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలోనే శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తూ నిర్ణయించగా, తెలంగాణ సర్కారు అంగీకరించింది. అయితే తెలంగాణవాదుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రాజెక్టులను అప్పగించేది లేదని కేంద్రజల్‌శక్తిశాఖకు లేఖ రాసింది. ఆపై అసెంబ్లీ వేదికగా తీర్మానం చేసింది. ఆ తర్వాత సాగర్ డ్యామ్ ఉదంతంపై కేంద్ర జలశక్తిశాఖ ఫిబ్రవరిలో మరో సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయిస్తే మాత్రం హాజరుకాలేదు. ఇరిగేషన్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలనే సాకుతో సమావేశం వాయిదా వేయాలని కోరింది. నాటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర సర్కారు సాగర్ డ్యామ్ ఉదంతంపై ఆరా తీసిన దాఖలాల్లేవని అధికారులే వెల్లడిస్తున్నా రు. అసెంబ్లీ తీర్మానాన్ని బోర్డుకు అప్పగించి చేతులు దులుపుకుందని, సాగర్‌డ్యామ్‌ను పూర్తిగా వదిలేసినట్లుగా సర్కారు వ్యవహరిస్తున్నదని అధికారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సాగర్ డ్యామ్ ఓఅండ్ఎం పనులు సజావుగా సాగేందుకు చొరవ చూపాలని ఇంజినీరింగ్ అధికారులు కోరుతున్నారు.

## మండుటెండలు..రాజకీయ ప్రచారాలు

హైదరాబాద్, మండుటెండలు తెలంగాణతో పాటు ఎపిలోనూ వివిధ పార్టీల కార్యకర్త లకు పరీక్ష పెట్టబోన్నాయి. ఎండాకాలం ఎన్నికలతో పార్టీల నేతలు మొదలు కార్యకర్తలు నానా హైరాన పడుతున్నారు. ఎన్నికల పోరులోకాంగ్రెస్ పార్టీ కూడా ఇందుకు సమాయత్తం అవుతోంది. ఎపిలో టిడిపి ఉమ్మడిగా పోరాటం చేపట్టింది. ఈ క్రమంలో పార్టీల్లో ఉన్న కార్యకర్తలంతా ఎండల్లో పడి పోరాడాల్సి ఉంటుంది. ఎండలు ఆందోళనకరంగా పెరుగుతున్న దశలో పార్టీల కార్యక్రమాలుమరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజలు ఇంటిపట్టున ఉండి దూరంగా ఉందా మనుకున్నా రాజకీయాల కారణంగా బయటకు రాక తప్పని పరిస్థితులు వస్తున్నాయి. వరుస ఆందోళనతో అధికార పార్టీతో పాటు అనేక పార్టీల కార్యకర్తలు నానాయాతన పడుతున్నారు. మార్చి ఎండలే కదా అని సర్దుకున్నా ఇప్పుడు మండుటెడల్లో ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలతో పాటు ఇతర చిల్లర పార్టీలకు కూడా ఈ యాతన తప్పడం లేదు. ఎక్కడ వెనకబడి పోతామో అన్న భయంతో నేతలు కార్యకర్తలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు.

# త్రిముఖ పోటీ- రేసులో నెగ్గేదెవరు, తగ్గేదెవరో !



వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లో పోటీ చేస్తున్న వారంతా ఎంపీలుగా పనిచేసిన వారే. వీరంతా మరోసారి అదృష్టాన్ని పరిక్షించుబోతున్నారు. ఆ పార్లమెంట్ నియోజకవర్గమే మహబూబాబాద్. మూడు ప్రధాన పార్టీ నుండి పోటీ చేసేవారు ఎంపీలుగా చేయడంతోపాటు ముగ్గురు ఒకే సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులు కావడంతో గెలుపు ఎవరిదనే ఉత్కంఠ నెలకొంది.మహబూబాబాద్ నియోజకవర్గంలో ముగ్గురి మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. ఈ నియోజక వర్గంలో ఆదివాసి గిరిజనులు, లంబాడీ గిరిజన ఓట్లు ఎక్కువ. అంతేకాకుండా మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుకొని ఉంది. ఇన్ని ప్రాధాన్యతలు ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలన్ని ఇక్కడినుంచి ప్రాతినిధ్యం వహించిన వారిని రంగంలోకి దింపాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా, మంత్రిగా పనిచేసిన బలరాం నాయక్, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత, బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాం నాయక్ లు బరిలో ఉన్నారు. దీంతో త్రిముఖ పోటీ నెలకొంది. వీరంతా గతంలో ప్రజలకు హామీల మీద హామీలు ఇచ్చిన వారే. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, లంబాడీల 12 శాతం రిజ్వేషన్లు, పోడు భూములకు పట్టాలు ఇలా అనేక హామీలు ఇచ్చారు. ఇవ్వని నెరవేరాయా... పాత హామీలతో ప్రజల్లోకి వెళ్తారా అనేది ప్రచారం మొదలుపెడితే తెలియనుంది.మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లంద, భద్రాచలం అసెంబ్లీ నియోజకర్గాలు వస్తాయి. ఇందులో నర్సంపేట తప్ప మిగితా ఆరు నియోజకవర్గాలు ఎస్టీ స్థానాలు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం మినహా ఆరు స్థానాలలో కైవసం చేసుకుంది. గెలుపే ఎవరి ధీమా వారే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఆరుగురు ఎమ్మెల్యే లు కాంగ్రెస్ వారే కాబట్టి గెలుపు పై దీమాతో ఉన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ అరు గ్యారెంటీలు విజయానికి బాటలు వేస్తాయనుకుంటున్నారు. ఇక బీఆర్ఎస్ విజయం తమదే అనే భావనలో ఉన్నారు. తెలంగాణ ఏర్పాటు అయిన నాటి నుండి మహబూబాబాద్ పార్లమెంట్ ప్రజలు రెండు సార్లు గెలిపించారని మూడవసారి సైతం గెలిపిస్తరని, 100 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు కలిసివస్తాయనే దీమాలో ఉన్నారు. కాంగ్రెస్, బీ అర్ ఎస్ పార్టీ లను పక్కన పెట్టి ఈ సారి బీజేపీ కు పట్టంకడతారని, అసెంబ్లీ ఎన్నికలకు , పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ ని కోరుకుంటున్నారని కాషాయం పార్టీ భావిస్తోంది. ఇలా తమ బలాబలాలను బేరీజు వేసుకుని గెలుపుకోసం వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు మూడు పార్టీ అభ్యర్థులు.అత్యధికంగా ఎస్టీ ఓటర్లు ఉన్న పార్లమెంట్ స్థానం మహబూబాబాద్. ఎస్టీల్లో ఆదివాసి గిరిజనులు, లంబాడీ గిరిజనులు ఉంటారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ స్థానానికి పోటీ పెరిగింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీతారామ్ నాయక్ మొదటి ఎంపీగా గెలుపొందగా, మాలోత్ కవిత గత ఎన్నికల్లో ఎంపీగా గెలిచి ప్రస్తుతం సిట్టింగ్‌గా ఉన్నారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడు ఎంపీ ఎన్నికలు అనూహ్యంగా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 14 లక్షల 28 వేల ఓట్లు ఉన్నాయి.2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌పై బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత సుమారు 1 లక్ష 46 మెజారిటీ గెలుపొందింది. కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ 3 లక్షల 15 వేల 445 ఓట్లు సాధించి రెండవ స్థానం లో నిలిచ్చారు. 25వేల 487 ఓట్లు సాధించి బీజేపీ అభ్యర్థి హుస్సేన్ నాయక్ ఐదవ స్థానంలోకి వెళ్లారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్నామన్న ధీమాతో కాంగ్రెస్ ఉంది. అధికారాన్ని కోల్పోయిన 100 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకత తోడు గులాబీ పార్టీ ఓటు బ్యాంక్ కలిసి వస్తుందనీ బీఆర్ఎస్ ఆలోచనలో ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో ప్రజలు విగిపోవడంతో పాటు కేంద్రంలో ప్రజలు మోడీని కోరుకుంటున్నారని బీజేపీ ఆశాభావంలో ఉంది.

# ఖాకీ మాటున ట్యాపింగ్ దందా



హైదరాబాద్, వాళ్లు ఖాకీలు కాదు.. ఖతర్నాక్ రౌడీలు.. ప్రభుత్వ పెద్దలు చెప్పిందే వారికి వేదం. చట్టాన్ని చుట్టంగా మార్చుకొని.. ప్రజల కోసం కాకుండా.. అమాత్యుల కోసం పనిచేసి.. ఇప్పుడు కటకటాల్లోకి వెళ్లారు. అయితే ఖాకీ డ్రెస్‌ను అడ్డంగా పెట్టుకొని చేసిన దారుణాలు, దందాల గుట్టు రట్టైంది. విపక్ష నేతలనే కాదు.. ఇంకా చాలా అంశాలపై జరిగిందీ ఈ ట్యాపింగ్ దందా. అంతేకాదు కొందరు సూత్రధారుల పేర్లు కూడా బయటికి వచ్చాయి.ఇప్పటివరకు మనమనుకున్నదేంటి.. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు విపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారు. కానీ విషయం మరింత ఉంది. తవ్వుతున్న కొద్ది అన్ని షాకింగ్ విషయాలే. ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న కీ ప్లేయర్లు కాగా.. ఈ ట్యాపింగ్ టీమ్‌కు కెప్టెన్లుగా వ్యవహరించింది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు.. వీరు నేతల ఫోన్లు మాత్రమే కాదు. రియల్ ఎస్టేట్ పెద్దలు.. వ్యాపారులు, హవాలా చేసేవారిని కూడా.. టార్గెట్ చేసింది ఈ ట్యాపింగ్ ముఠా.ఏం చేస్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? తమ పార్టీ నేతలను ఏమైనా సంప్రదిస్తున్నారా? ఎవరెవరు ఏ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు? ఇలా కొన్ని డౌట్స్‌తనేతల ఫోన్లను ట్యాప్ చేశారనుకుందాం. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, హవాలా దందా చేసే వారి ఫోన్లను ట్యాప్ చేయడం ఎందుకు? ఇప్పుడీ క్వశ్చనే కాస్త ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి అప్పుడు టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి ఆరోపణలను రిమైండ్ చేసుకోవాలి.ఇవే అప్పుడు ఆయన చేసిన అలిగేషన్స్. అప్పటి అలిగేషన్స్‌కు.. ఇప్పుడు బయటపడుతున్న విషయాలకు లింక్ ఉన్నట్టు అనిపిస్తోంది కదూ. ఫండ్స్ మరే ఇతర పార్టీకి వెళ్లకుండా అడ్డుకోవడం ఫస్ట్ టార్గెట్ అయితే.. ఆ ఫండ్స్ మొత్తం బీఆర్ఎస్‌కే రావడం సెకండ్ టార్గెట్. ఇదే కాన్సెప్ట్‌తో ట్యాపింగ్ దందా కొనసాగిందన్న ఆరోపణలకు ఇప్పుడు బలం చేకూరింది. 36 మంది రియల్‌ఎస్టేట్ బిల్డర్లు.. జ్యువెలరీ వ్యాపారుల ఫోన్లు ట్యాప్ అయ్యాయి. ఇదీ అఫిషియల్ ఇన్ఫర్మేషన్.. ఫోన్లు చేయడం.. డబ్బులు డిమాండ్ చేయడం.. ఫలానా నేతతో ఎందుకు మాట్లాడుతున్నావని బెదిరించడం. ఇవీ ఇప్పటి వరకు తెలిసిన విషయాలు.. మరిన్ని విషయాలు బయటికి రావాల్సి ఉంది.ప్రస్తుతం విచారణలో నోరు తెరుస్తున్నారు అధికారులు.. ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు చెప్తేనే ఫోన్ ట్యాప్ చేశారు. భుజంగరావు, తిరుపతన్న ఇచ్చిన నెంబర్స్ కూడా ట్యాప్ చేశాను. మా కాన్సన్‌ట్రేషన్ మొత్తం నేతల కదలికలు, నిధుల సమీకరణ.. సొసైటీ పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్న కొందరి ఫోన్లు కూడా ట్యాప్ చేశాం. చేసిందంతా ఉన్నతాధికారులు చెప్పారనే.. ఇదీ పోలీసుల విచారణలో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు చెప్పిన విషయాలు. అంతేకాదు హార్డ్ డిస్కులు ఎందుకు పనికిరాకుండా డిస్ట్రాయ్ చేసి.. ఆ ముక్కలను వెళ్లి మూసీలో నిమజ్జనం చేశామన్నారు ప్రణీత్‌రావు.మరో కీలక అధికారి కూడా భుజంగరావు కూడా నోరు తెరుస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక నేత ఇచ్చిన నెంబర్స్‌ను మాత్రమే ట్యాప్ చేశాను. ఆ నేతలిచ్చిన నంబర్స్.. ప్రణీత్‌రావుకు.. ప్రణీత్‌రావు ఇచ్చిన ఇన్ఫోని.. మళ్లీ బీఆర్ఎస్ నేతకు అందించాడు. ఈ ఆపరేషన్ అంతా ఎలా జరిగిందో విచారణలో పూసగుచ్చినట్టు చెప్పారు భుజంగరావు.సో.. ఇద్దరి స్టేట్‌మెంట్స్‌ను చూస్తే.. బీఆర్ఎస్ నేతలు, ఖాకీ పెద్దలు, వీరి డైరెక్షన్‌లోనే జరిగింది ఈ దందా అంతా. ప్రస్తుతం రాధాకిషన్ రావు, ప్రభాకర్ రావులో యూఎస్‌లో ఉన్నారు. కానీ ఇక్కడ ఇన్వెస్టిగేషన్ మాత్రం ఆగడం లేదు. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో వీళ్లంతా పాత్రధారులే.. సూత్రధారులు ఇంకా వేరే వాళ్లు ఉన్నారని. ఇప్పుడదే నిజమైంది. ప్రణీత్‌రావు నోటి నుంచి ఇప్పటికే పలువురు కీలక నేతల పేర్లు వచ్చాయని తెలుస్తోంది.బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న ఆ నేతలకు త్వరలోనే నోటీసులు వెళ్లనున్నాయి. మరి వారి నోటి నుంచి ఎలాంటి ఆన్సర్స్ వస్తాయి. అనేది ఇప్పుడు కాస్త ఇంట్రెస్టింగ్‌గా మారింది.కానీ ఇక్కడ సమాధానం రావాల్సిన కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. వ్యాపారులను ఎందుకు బెదిరించారు? అలా బెదిరించి వసూలు చేసిన డబ్బులు ఎక్కడికి చేరాయి? ఎవరికి చేరాయి ? ఎవరి డైరెక్షన్‌లో ఇదంతా జరిగింది ? అనేది ఇప్పుడు కాస్త ఇంట్రెస్టింగ్‌గా మారింది. ప్రస్తుతం పోలీసుల స్పీడ్ చూస్తుంటే.. అతి త్వరలో వీటికి కూడా ఆన్సర్స్ బయటపడటం.. కొందరు గులాబీ పెద్దలు శ్రీకృష్ణజన్మస్థానానికి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఎన్నికలకు దూరంగా కల్వకుంట్ల ఫ్యామిలీ

హైదరాబాద్, మారిన రాజకీయ పరిణామాలతో దేశవ్యాప్తంగా విస్తరించాలని ప్రస్తుత ఉద్యమ పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి.. బీఆర్ఎస్‌గా మారింది. రాజకీయాలే పరమావధిగా అవిర్భవించిన పార్టీ చరిత్రలో తొలిసారిగా పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుటుంబం లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉంటోంది.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అతని కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు 2004 నుండి ప్రతి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీ రామారావు, కేసీఆర్ మేనల్లుడు టి.హరీష్ రావుల్లో ఎవరో ఒకరు ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయవచ్చని ఊహాగానాలు వచ్చాయి. అయితే ఆ ముగ్గురు ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా ఎన్నికల బరిలోకి దిగలేదు. గతంలో ఎంపీగా గెలిచిన కవిత లిక్కర్ స్కామ్ కేసుతో ఈసారి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో ఓడిపోయిన కేసీఆర్ కుమార్తె కె.కవిత ఈసారి పోటీ చేయడం లేదు. తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా ఉన్న ఆమెను ఇటీవల ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపించింది. ఈసారి లోక్ సభ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది.2001లో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసిన కేసీఆర్ 2004లో కరీంనగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికై కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రి అయ్యారు. 2006, 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన అదే స్థానాన్ని నిలబెట్టుకున్నారు.2009లో కేసీఆర్ మహబూబ్‌నగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈ కాలంలోనే తెలంగాణ రాష్ట్ర లక్ష్యాన్ని సాధించడంలో విజయం సాధించారు.2014లో తెలంగాణలో టీఆర్ఎస్ తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. మరోసారి అసెంబ్లీకి ఎన్నికైన ఆయన కుమారుడు, మేనల్లుడు ఆయన కేబినెట్‌లో మంత్రులు అయ్యారు. ఏకకాలంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ కూతురు కవిత నిజామాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. 2018లో టీఆర్ఎస్ అధికారాన్ని నిలబెట్టుకోగా, 2019 ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ చేతిలో కవిత ఓడిపోయారు. ఆ తర్వాత ఆమె శాసనమండలికి ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ చేతిలో అధికారాన్ని కోల్పోయింది.మే 13న ఎన్నికలు జరగనున్న



మొత్తం 17 స్థానాలకు అభ్యర్థులను బీఆర్ఎస్ ప్రకటించింది. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతూకం పాటించామని ఆ పార్టీ పేర్కొంది. అభ్యర్థుల ఎంపికలో కేసీఆర్ సామాజిక సమీకరణలను పరిశీలించి, తద్వారా అన్ని వర్గాల విశ్వాసాన్ని పొందేలా అభ్యర్థుల ఎంపిక చేసినట్లు గులాబీ పార్టీ నేతలు తెలిపారు. అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తే వెనుకబడిన కులాల నుంచి ఆరుగురు, షెడ్యూల్డ్ కులాల నుంచి ముగ్గురికి, షెడ్యూల్డ్ తెగల నుంచి ఇద్దరికి, ఇతర కులాల నుంచి ఆరుగురికి బీఆర్ఎస్ టికెట్లు దక్కాయి.2019లో తొమ్మిది స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు ? నామా నాగేశ్వరరావు (ఖమ్మం), మాలోత్ కవిత (మహబూబాబాద్), మన్నె శ్రీనివాస్ రెడ్డి (మహబూబ్‌నగర్)లకు మరోసారి అవకాశం కల్పించింది. ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు ఇతర పార్టీలకు ఫిరాయించగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఒక సిట్టింగ్ ఎంపీ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఇక ప్రజల మద్దతున్న నాయకులను ఎంపిక చేయడం ద్వారా, ప్రత్యర్థులతో పోలిస్తే వీరికి మంచి అవకాశాలు ఉన్నాయని బీఆర్ఎస్ భావిస్తోంది.ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని, ఈ భావన మరింత బలపడుతోందని గులాబీ పార్టీ విశ్వసిస్తోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో తన విజయాన్ని నమోదు చేసేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోంది. కొంతమంది అభ్యర్థులు ఇప్పటికే నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. తమకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని గులాబీ పార్టీ పేర్కొంది. అన్ని నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల ఆదరణ పొందేందుకు పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో నియోజకవర్గాల్లో పర్యటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు:

# భావోద్వేగాన్నే రేవంత్ నమ్ముకున్నారా...



హైదరాబాద్, రాజకీయ నాయకులకు ముందు చూపు ఉండాలి. అధికారంలో ఉన్న వాళ్లకు అది మరింత ఎక్కువ ఉండాలి. వరుస ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన చిరకాలం అధికారంలో ఉంటారని కాదు. బలమైన ప్రతిపక్షం లేకపోవడం వల్లే అధికారం దక్కుతోందని రాజకీయ పార్టీలు భావించాల్సి ఉంటుంది. ఇలా అంచనా వేయకపోవడం వల్లే మూడోసారి కేసీఆర్ తెలంగాణలో అధికారానికి దూరమయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించి.. 2023 లో జరిగిన ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించాల్సిన చోట బోల్తాపడ్డారు.. అప్పట్లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీని చీల్చి చెండాడాడు. అయితే బిజెపి విషయంలో ఆ స్థాయిలో దూకుడు చూపించలేకపోయాడు. చివరికి మోడీతో పెట్టుకుని కొరివితో తల గోక్కున్నాడు. రాజకీయాలలో కేసీఆర్ అపర చాణక్యుడని చాలామంది అంటారు. రాజకీయాల్లో ఆయనను మించిన తలపండిన నాయకుడు లేడని కొనియాడుతుంటారు. కానీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన రాజకీయ చాణక్యం పనికి రాలేదు. తలపండిన ఆయన అనుభవం అక్కరకు రాలేదు. ఈడా బోడా? అని సవాల్ విసిరితే.. ఈడీ వచ్చింది. తన కూతుర్ని అరెస్టు చేసి తీసుకెళ్లింది. పది రోజులపాటు కస్టడీలో ఉంచుకుంది. తర్వాత ఏం చేస్తుందనేది ఇప్పటికీ అంతు పట్టడం లేదు. ఒకవేళ కేసీఆర్ నడుము ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోడీని సరిగ్గా అంచనా వేసి ఉంటే.. పకడ్బందీగా ప్రణాళికలు అమలు చేసి ఉంటే.. కేసీఆర్ కు ఈ రోజున ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని రాజకీయ విశ్లేషకులు భావన. "కానీ ఏం చేస్తాం.. అప్పుడు చెబితే కేసీఆర్ వినిపించుకోలేదు.. ఇప్పుడు చెప్పినా ఉపయోగం లేదని" ఆ పార్టీ నాయకులు నిట్టూర్చుతున్నారు.ఇక గతంలో కేసీఆర్ చేసిన తప్పునే ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు యాంటీ కేసీఆర్, యాంటీ బీఆర్ఎస్ కోణంలో మాత్రమే రేవంత్ రెడ్డి తన పరిపాలన కొనసాగిస్తున్నారు. ఇంతవరకు ఆయన నరేంద్ర మోడీపై ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే విమర్శలు చేశారు. పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ రేవంత్ రెడ్డి ఇంతవరకు యాంటీ మోడీ కోణంలో ప్రచారం చేయలేదు. దీనివల్ల జరిగే నష్టం ఏ స్థాయిలో ఉంటుందో కళ్ళ ముందు కేసీఆర్ రూపంలో సజీవ సాక్ష్యం కనిపిస్తూనే ఉంది. అలాంటప్పుడు రేవంత్ రెడ్డి ఎంత త్వరగా మేలుకుంటే అంత మంచిది. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందనే ఊహాగానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో.. రేవంత్ రెడ్డి ఎంత జాగ్రత్త పడితే అంత మంచిది..ప్రస్తుతం రేవంత్ వ్యవహరిస్తున్న యాంటీ కేసీఆర్, యాంటీ బీఆర్ఎస్ దీర్ఘకాలం ప్రజల్లో భరోసా ఇవ్వలేవు. కొంతకాలం వరకు భావోద్వేగాలతో రాజకీయాలు నడపొచ్చు. గత ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాల మీద బండి లాగించవచ్చు. కానీ అంతిమంగా ప్రభుత్వం ఏం చేసిందనేదే ప్రజలు చూస్తారు. అంతేకాదు కేవలం కేసీఆర్ మీద టార్గెట్ చేస్తే.. బీజేపీని ఎందుకు ప్రశ్నించడం లేదనే మాట కచ్చితంగా ప్రజల నుంచి వస్తుంది. అలాంటి ప్రశ్న ఎదురుగాకముందే తన చేతుల్లో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి పై ఉంటుంది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత భారతీయ జనతా పార్టీ నిశ్శబ్దంగా ఉంటుందనేది అనుమానమే. మహారాష్ట్రలో ఆల్రెడీ శివసేనలో చీలికలు తెచ్చింది. బీహార్లో పాగా వేసింది. కర్ణాటకలో కాంగ్రెస్ కింద మంటలు పెడుతూనే ఉంది. తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వాన్ని స్టాలిన్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టింది. కేరళ ప్రభుత్వాన్ని అదును చూసి దెబ్బ కొడుతోంది. సో ఎటు చూసుకున్నా మోడీ రాజసూయ యాగం దూకుడుగానే కొనసాగుతోంది. మరి దీనిని రేవంత్ ఎలా తట్టుకుంటారనేది చూడాల్సి ఉంది.అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే ప్రచారం కొనసాగిస్తామంటే ప్రజలు ఒప్పుకునే పరిస్థితి ఉండదు. ఎందుకంటే రాష్ట్రానికి, పార్లమెంటు ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. పైగా కేసీఆర్ వ్యతిరేక ప్రచారం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కలిసి రాదు. ఎందుకంటే కేంద్రంలో అధికారంలో ఉంది భారతీయ జనతా పార్టీ కాబట్టి.. అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తేనే రేవంత్ కోరుకున్న 12 నుంచి 13 స్థానాలు కాంగ్రెస్ పార్టీకి దక్కుతాయి. అప్పుడు రాష్ట్రంలో రేవంత్ నాయకత్వం మరింత బలపడుతుంది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వద్ద రేవంత్ పలుకుబడి మరింత పెరుగుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వైయస్ రాజశేఖర్ రెడ్డి కి లభించిన అంత స్వేచ్ఛ రేవంత్ కు లభిస్తుంది. ఇవన్నీ జరగాలంటే యాంటీ బీజేపీ కోణంలో, నరేంద్ర మోడీ కోణంలో రేవంత్ పయనం సాగించాలి

# మండుతున్న సూరీడు...



హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం చల్లబడిన వాతావరణం ఇప్పుడు రోజురోజుకూ వేడి పెరిగిపోతుంది. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మార్చి నెలలోనే 41 డిగ్రీలు దాటాయి. ఇక రాత్రి పూట పలు ప్రాంతాల్లో 26 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోనే నిర్మల్ మండలంలోని అక్కాపూర్ గ్రామంలో సోమవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం మధ్యాహ్నం వరకు అక్కాపూర్‌లో దాదాపు 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.ఆ తర్వాత 41 డిగ్రీల ఉష్ణోగ్రతతో నిజామాబాద్ మోర్తాడ్ రెండో స్థానంలో నిలిచింది. కుమ్రంభీంలోని ఆసిఫాబాద్‌లో 40.9 డిగ్రీలు, ఆదిలాబాద్‌లోని చాప్రాలాలో 40.8 డిగ్రీలు, సూర్యాపేటలోని రైనిగూడెంలో 40.7 డిగ్రీలు, నిజామాబాద్‌లోని కోరట్‌పల్లిలో 40.7, మహబూబ్‌నగర్‌లోని వడ్డేమాన్‌లో 40.6 డిగ్రీలు, నిర్మల్ జిల్లాలోని దస్తూరాబాద్‌లో 40.6 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 40.5 డిగ్రీలు, సిరికొండలో 40.5 డిగ్రీల చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) వెల్లడించింది.ఇక మునుముందు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో మూడు డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉదయం సమయంలో చల్లని వాతావరణం దర్శనమిచ్చినా.. మధ్యాహ్నం వేళల్లో మాత్రం ఎండ దంచికొడుతోంది. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు శీతల పానీయాలను సేవిస్తూ.. చల్లని ప్రాంతాల్లో సేద తీరుతున్నారు. ఇక హైదరాబాద్‌లోనూ వచ్చే ఐదురోజులు ఎండ తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా మార్చి 28, 29, 30 తేదీల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, రాత్రిపూట 25 నుంచి 26 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. వచ్చే నెల రెండో వారం నుంచి ఎండల తీవ్రత మరింత పెరనుంది. ఏప్రిల్, మే నెలల్లో వడగాల్పుల తీవ్రత అధికమవనుంది.

# బీజేపీ అభ్యర్థులంతా చంద్రబాబు మనుషులే: సజ్జల



అమరావతి,బీజేపీ తరఫున పోటీ చేయబోతున్న అభ్యర్థుల జాబితాను కూడా చంద్రబాబు నిర్ణయించారని సజ్జల ఆరోపించారు. సజ్జల ఏపీలో త్వరలో జరగబోతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, బీజేపీ, జనసేనలు పొత్తు పెట్టుకుని కూటమిగా ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బీజేపీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్న అభ్యర్థుల జాబితాను బీజేపీ హైకమాండ్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని 10 శాసనసభ స్థానాలకు గాను బరిలో దిగుతున్న క్యాండిడేట్ల వివరాలను బిజెపి వెల్లడించింది. ఈ క్రమంలోనే ఆ జాబితా పై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారు.బీజేపీ తరఫున పోటీ చేయబోతున్న అభ్యర్థుల జాబితాను కూడా చంద్రబాబు నిర్ణయించారని సజ్జల ఆరోపించారు. బీజేపీలోని తన మనుషులకు టికెట్లు ఇప్పించి చంద్రబాబు పావులు కదిపారని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీలో ఉన్నది టీడీపీ ఏజెంట్లేనని కథనాలు వస్తున్నాయని సజ్జల ఆరోపించారు.3 కోట్లు ఇస్తే సీటు వదిలేస్తానని టీడీపీ నేతకు ఓ బీజేపీ నేత ఆఫర్ ఇచ్చినట్టు ఆడియో లీక్ అయిందని గుర్తు చేశారు. ఇక, జనసేన అభ్యర్థుల జాబితానూ చంద్రబాబు తన మనుషులతో నింపేశారని ఆరోపించారు. ఇదంతా చంద్రబాబు ఆడుతున్న నాటకం అని సజ్జల ఎద్దేవా చేశారు. నకిలీ నోటు వంటి చంద్రబాబు రూ.4 వేల పెన్షన్ ఇస్తానంటే ఎవరూ నమ్మరని చురకలంటించారు. చంద్రబాబు చెప్పేవి జరగవని, పొరపాటున ఆయన అధికారంలోకి వస్తే జగన్ ఇస్తున్న పథకాలు ఆపేస్తాడని ప్రజలకు బాగా తెలుసని అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com